# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

prajakshetram.in

సంపుటి - 01 | సంచిక - 245 | హైదరాబాద్ | గురువారం | 19- 12 -2024 | పేజీలు - 6 | వెల.4/-



అతి కొద్ది కాలంలోనే ఆదరణ పొందిన 'ప్రజాక్షేత్రం'
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని మండలాల వారిగా
నియోజకవర్గాల వారిగా, జిల్లాల వారిగా

రిపోర్టర్లు కావలెను

అనుభవం గలవారికి ప్రాధాన్యం ఇవ్వబడును

ప్రజాక్షేత్రం

కాల్ : 9177920459


# ధరణి స్థానంలో భూ భారతి

- ఇక పక్కాగా రెవెన్యూ రికార్డులు
- ప్రజలకు భరోసానిచ్చేలా కొత్త చట్టం
- ధరణి సమస్యలకు చెక్ పెట్టే విధంగా మార్పులు
- అన్ని వర్గాలతో చర్చలు..సలహాలతో కొత్త చట్టం
- వివాదాల పరిశీలనకు కొత్తగా ట్రిబ్యునల్ ఏర్పాటు
- గ్రామానికో రెవెన్యూ అధికారి నియామకం
- అసెంబ్లీలో కొత్త రెవెన్యూ చట్టం తెచ్చిన ప్రభుత్వం
- గత పాలకుల ధరణి మోసాలను ఎండగట్టిన పొంగులేటి



హైదరాబాద్,డిసెంబర్18(ప్రజాక్షేత్రం:

ధరణిలో జరిగిన అవతవకలను అరికట్టి, రైతులకు న్యాయం చేయాలన్న సంకల్పంతోనే భూభారతిని తీసుకుని వస్తున్నామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి తెలిపారు. భేషజాలకు పోయి 'ధరణి'ని మార్చడం లేదని.. ప్రజాసమస్యల పరిష్కారానికే ఆ పోర్టల్‌ను రద్దు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన పోర్టల్ వల్ల 4 నెలలు రిజిస్ట్రేన్లు జరగలేదన్నారు. శాసనసభలో 'భూభారతి' బిల్లును పొంగులేటి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'ధరణితో అనేక మంది ఇబ్బందులు పడిన మాట వాస్తవం. ఆ పోర్టల్‌ను బంగాళాఖాతంలో వేస్తామని హామీ ఇచ్చాం.. ఇప్పుడు వేస్తున్నాం. ధరణి స్థానంలో భూభారతిని తీసుకొస్తున్నాం. భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు లిఖితపూర్వకంగా సూచించిన అంశాలను పొందుపరిచాం. ముసాయిదా బిల్లును 40 రోజులు వెబ్‌సైట్‌లో ఉంచాం. ఎమ్మెల్యేలు, మేధావులు ఇచ్చిన అంశాలను డ్రాఫ్ట్‌లో పెట్టాం. రాష్ట్రంలోని 33 కలెక్టరేట్లలో ఒకరోజు చర్చ కూడా నిర్వహించాం. 18 రాష్ట్రాల్లో ఆర్ఓఆర్ చట్టాలను పరిశీలించి భూభారతి తీసుకొచ్చాం. ప్రతి గ్రామానికి ఓ రెవెన్యూ అధికారిని నియమిస్తాం. భూ వివాదాలపై అప్పీలుకు ట్రైబ్యునల్ ఏర్పాటు చేస్తాం. అనుభవదారుల కాలాన్ని కూడా ఈ కొత్త బిల్లులో పొందుపరిచాం. 33 మాడ్యూల్స్‌తో ఉన్న దాన్ని 6 మాడ్యూల్స్‌తో పునఃప్రక్షాళన చేస్తున్నాం'అని పొంగులేటి సభలో వివరించారు. తెలంగాణలో సామాన్యుల భూహక్కుల పరిరక్షణే ధ్యేయంగా 2024 ఆర్వోఆర్ -భూభారతి చట్టాన్ని రూపొందించామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఇటువంటి అద్భుతచట్టాన్ని ప్రవేశపెట్టే అవకాశం తనకు లభించడం మరచిపోలేని విషయమని అన్నారు. 1971లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్వోఆర్ చట్టం 49 ఏళ్లపాటు ఉపయోగపడిందని, ముఖ్యంగా రాష్ట్ర విభజన తర్వాత కూడా ఏడేళ్ల పాటు కూడా ప్రజోపయోగంగా ఉపయుక్తమయ్యిందని తెలిపారు. తర్వాత అర్ధరాత్రి నాలుగు గోడల నడుమ రూపొందిన ధరణి చట్టం వలన సమస్యలు పరిష్కారం కాకపోగా లక్షలాది సమస్యలను తెచ్చిపెట్టిందని చెప్పారు. కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలిక ఊడిందన్నట్లు మిగతా 2లో..

# అవినీతిపై చర్చకు ప్రధాని వెనకడుగు

- ఆదానీ అవినీతికి మోడీ ముసుగు
- ఆదానీ అవినీతిపై జెపిసి వేయాల్సిందే
- అవసరమైతే రాష్ట్రపతి భవన్ ముందూ ధర్నా
- హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా
- రాజ్‌భవన్ ముందు ధర్నాకు దిగిన ప్రభుత్వ పెద్దలు
- ధర్నాలో సిఎం రేవంత్, డిప్యూటీ సిఎం భట్టి, మంత్రులు

2లో



## జమ్ముకశ్మీర్‌లో అగ్ని ప్రమాదం..

### - ఆరుగురి మృతి



శ్రీనగర్, డిసెంబర్ 18(ప్రజాక్షేత్రం:

జమ్ముకశ్మీర్‌లోని కథువాలో బుధవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. శివనగర్ లోని ఓ ఇంట్లో మంటలు చెలరేగడంతో ఇల్లంతా దట్టమైన పొగ వ్యాపించింది. దీంతో ఊపిరాడక ఆరుగురు మరణించారు. మరో ముగ్గురు అపస్మారకస్థితిలోకి వెళ్లారు. వారిని చికిత్స నిమిత్తం కథువాలోని జీఎంసీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమం గా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, అగ్ని ప్రమా దం గురించి తెలియగానే పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలు ఆర్పివేసే ప్రయత్నం చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఇంటికి మంటలు అంటుకున్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు.

# లోటుపాట్లు సరిచేసుకుంటాం

- అక్రమార్కులను వదిలేది లేదు.
- 5 నెలల్లో 200 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి



హైదరాబాద్,డిసెంబర్18(ప్రజాక్షేత్రం:

లోటుపాట్లు ఏమైనా ఉంటే వాటిని సవరించుకొని మరింత నిబద్ధతతో హైడ్రా పనిచేస్తోందని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. వివిధ సందర్భాలలో కోర్టులు ఇచ్చిన తీర్పులకు లోబడి హైడ్రా ముందుకు వెళ్తోంది. ప్రభుత్వం దిశానిర్దేశం మేరకు హైడ్రా పని చేస్తుంది. హైడ్రాను బలోపేతం చేయడానికి ప్రభుత్వం పలు అధికారాలను కట్టబెట్టింది. సాంకేతికంగా కూడా మరింత బలంగా తయారవుతుంది. గత 5 నెలల్లో హైడ్రా దాదాపు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని మిగతా 2లో..

# అదానీకి ఏజెంట్‌గా కొమ్ముకాస్తున్నావు

- దావోస్ వెళ్లి అదానీతో రూ. 12,400 కోట్ల అగ్రిమెంట్లు
- నీది నిజంగా అదానీ అవినీతి మీద పోరాటం నిజమా?!
- వెంటనే అగ్రిమెంట్లు రద్దు చేసి నిజాయితీ చాటుకో..
- రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతి ఇచ్చావు
- సీఎం రేవంత్ రెడ్డి రోడ్ల మీద సర్కస్ ఫీట్లు
- రేవంత్ రెడ్డిని చూస్తే ఊసరవెల్లి కూడా సిగ్గు పడుతుంది
- అసెంబ్లీ బయట డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు పెట్టాలి
- కొంతమంది సభ్యులు డ్రింక్ చేసి సభకు వస్తున్నారు
- సభలోకి వచ్చి ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదు
- ఎంబీబీఎస్ అడ్మిషన్లలో తప్పుడు నియమాలు
- వందల మంది స్థానిక అభ్యర్థులకు నష్టం జరిగింది
- మెడికల్ విద్యార్థులకు జరిగిన నష్టానికి పూర్తి బాధ్యత కాంగ్రెస్‌దే
- లోకల్ కోటా నిబంధనలు స్థానికుల అవకాశాలను దెబ్బ తీస్తాయి
- నేడు కాంగ్రెస్ తెచ్చిన లోకల్ కోటాను హైకోర్టు రద్దుచేసింది
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యంగ్యాస్త్రాలు
- హరీశ్‌రావు పట్ల పోలీసులు అత్యుత్సాహం..
- శాసనసభ ప్రవేశ మార్గంలో పేపర్లు లాక్కున్న పోలీసులు
- ఆటో డ్రైవర్లకు సంఘీభావం..
- ఖాకీ దుస్తుల్లో అసెంబ్లీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం



హైదరాబాద్, డిసెంబర్ 18(ప్రజాక్షేత్రం:

సీఎం రేవంత్ రెడ్డి రోడ్ల మీద చేస్తున్న సర్కస్ ఫీట్లు చూస్తే ఊసరవెల్లి కూడా సిగ్గు పడుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడారు. మొదటి రోజు శాసనసభకు అదానీ, రేవంత్ అక్రమ సంబంధం మీద నిరసనగా టీషర్ట్స్ వేసుకొని వస్తే అడ్డుకున్నారు. తమను సభా ప్రాంగణంలోకి కూడా అడుగు పెట్టనివ్వలేదు. ఈ రోజు రాజ్ భవన్ వద్ద అదానీ అవినీతి గురించి మాట్లాడినట్లు రేవంత్ సర్కస్ చేసిండు. అక్కడికి వెళ్లి కూడా కేసీఆర్ గురించి, బీఆర్ఎస్ గురించే మాట్లాడిండు తప్ప, అదానీ అవినీతి గురించి మాట్లాడింది తక్కువ. మీ పోరాటం అదానీ మీద అయితే మిగతా 2లో...

# రూ. 22,280 కోట్ల విలువైన

- మాల్యా, చోక్సీ ప్రాపర్టీలు సీజ్ : నిర్మలాసీతారామన్



న్యూఢిల్లీ,డిసెంబర్ 18(ప్రజాక్షేత్రం:

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తన విచారణలో భాగంగా అనేక కేసులకు సంబంధించిన ప్రాపర్టీలను సీజ్ చేసి అటాచ్ చేసింది. ఆర్థిక నేరాలకు లింకున్న ఆ ప్రాపర్టీలను స్వాధీనం చేసుకున్నారు. లోక్‌సభలో మిగతా 2లో...

# అంబేడ్కర్‌ను అవమానించిందే కాంగ్రెస్


- అమిత్‌షాపై కాంగ్రెస్ విమర్శలు దారుణం
- ఎక్స్ వేదికగా మండిపడ్డ ప్రధాని మోడీ



న్యూఢిల్లీ,డిసెంబర్18(ప్రజాక్షేత్రం:

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్ షా అవమానించారంటూ ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న క్రమంలో...తాజాగా దీనిపై ప్రధాని మోదీ స్పందించారు. అంబేడ్కర్ వారసత్వాన్ని తుడిచిపెట్టేందుకు షెడ్యూల్ కులాలు, తెగలను కించపరిచేందుకు కాంగ్రెస్ ఎన్ని ప్రయత్నాలు చేసిందో ప్రజలంతా చూశారని పేర్కొన్నారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. 'కొన్నేళ్ల పాటు మిగతా 2లో...

## టీజీ టెట్2024 పరీక్షల షెడ్యూల్ విడుదల



హైదరాబాద్,డిసెంబర్ 18(ప్రజాక్షేత్రం:

టీజీ టెట్2024 పరీక్షల షెడ్యూల్‌ను తెలంగాణ పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. జనవరి 2వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పది రోజుల పాటు 20 సెషన్లలో పరీక్షలను నిర్వహించనున్నారు. ప్రతి రోజు రెండు సెషన్లు అంటే సెషన్ 1 ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, సెషన్ -2 మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పేపర్-1 పరీక్షలను జనవరి 8, 9, 10, 18 తేదీల్లో నిర్వహించనున్నారు. పేపర్ -2 పరీక్షలను జనవరి 2, 5, 11, 12, 19, 20వ తేదీల్లో మిగతా 2లో..

# ధరణి స్థానంలో భూ భారతి

మెదటిపేజీ తరువాయి

ధరణి పోర్టల్‌తో లెక్కలేనన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని వివరించారు. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, నాటి ప్రతిపక్షనేత , నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి , నేటి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తమ పాదయాత్రల సందర్భంగా ధరణిని సముద్రంలో కలుపుతామని ఇచ్చిన హామీని ప్రజలు విశ్వసించారని మంత్రి పొంగులేటి తెలిపారు. ఆమేరకు ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారని, ఒక్క గుంట భూమి ఉన్న వారు కూడా తమను నమ్మారని, వారి నమ్మకాన్ని నిలబెట్టేందుకుగాను ఆర్వోఆర్ 2020ను పూర్తిగా ప్రక్షాళన చేసి భూభారతిని రూపొందించామని చెప్పారు. తాము ఆగస్టు 2న ముసాయిదాను ప్రవేశపెట్టడమేగాక ప్రత్యేకంగా 40 రోజుల పాటు వెబ్ సైట్‌లో పెట్టి ప్రజాప్రతినిధులు,కవులు , మేధావులు, విశ్రాంత అధికారుల సలహాలు సూచనలు స్వీకరించి కొత్త చట్టానికి రూపకల్పన చేశామని తెలిపారు. మాజీ మంత్రి హరీష్ రావు 7 పేజీలు, వినోద్‌రావు 5 పేజీల సలహాలు . సూచనలు చేశారని వాటిని కూడా పరిగణనలోకి తీసుకున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. 33 జిల్లాలలో ఒక్కోరోజు ప్రత్యేక చర్చావేదికలు నిర్వహించి అందరి అభిప్రాయాలు తీసుకున్నామని చెప్పారు. ధరణ కారణంగా ఎంతోమంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కేసముద్రం మండలం నారాయణపురంలో కె. రవి అనే ఎంపీటీసీ సభ్యులు భూ సమస్‌లలను బిఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలందరి దృష్టికి తీసుకువెళ్లారని , ఏళ్ల తరబడి పరిష్కారం కాలేదని చెప్పారు. అంతేగాక సర్వేనెంబర్లు 149,150, 154,156, 168 తదతరాల్లోని 1398 ఎకరాల భూమి తరతరాలుగా అక్కడి గిరిజనుల సాగుబడిలో ఉన్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. ధరణి -2020 ఆర్వోఆర్ చట్టం వచ్చాక వారి హక్కులకు భంగం వాటిల్లేలా సదరు భూములు అటవీ భూములని తేల్చిచెప్పారని దీంతో గిరిజనులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని మంత్రి వివరించారు. భూభారతి బిల్లుకు సంబంధించి 22-23 సార్లు అభిప్రాయాలు తీసుకున్నామని, అందువల్లే బిల్లు ప్రవేశపెట్టడంలో .జాప్యం జరిగిందని మంత్రి పొంగులేటి చెప్పారు. ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగ పడేలా బిల్లు తయారుచేసేందుకు కృషి చేశామని, సాదాసీదా బిల్లును ప్రజలపై రుద్దే ఆలోచన తమ ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టం చేశారు. భూమి చుట్టూ మనిషి జీవితం ముడిపడి ఉంటుంది. తరతరాలుగా మనిషి జీవితానికి, భూమికి విడదీయరాని అనుబంధం ఉంది. భూమి పేదరికాన్ని దూరం చేస్తుంది. ఆత్మగౌరవంతో బతికే అవకాశాన్ని ఇస్తుంది. కష్టానికి తగిన ప్రతిఫలాన్ని ఇస్తుంది. గ్రామాల్లో భూమే ప్రధాన జీవనాధారం. భూమిని నమ్ముకుని బతికే కష్టజీవులను కంటికి రెప్పలా చూసుకునే బాధ్యత ప్రభుత్వాలది. కానీ గత ప్రభుత్వం దీన్ని విస్మరించింది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 1971లో తీసుకొచ్చిన ఆర్వోఆర్ చట్టం 49 ఏండ్లు విజయవంతంగా అమలైంది. ప్రజల అవసరాలే లక్ష్యంగా అసైన్డ్ లాండ్స్ మొదలు అనేక విధాన నిర్ణయాలను గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని వివరించారు. కాంగ్రెస్ అంటేనే ప్రజలకు ఒక భద్రత, భరోసా. అందుకే ఇప్పటికీ ఇందిరమ్మను ప్రజలు గుండెల్లో పెట్టుకుంటున్నారు. ధరణి కారణంగా భూ యజమానికి తెలియకుండానే చేతులు దాటిపోయేలా చేసింది. కాళ్ళకింద నేల కదిలిపోయినా పేదలు వారి ఆవేదనను చెప్పుకోడానికీ మార్గం లేకుండా చేసింది. ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మా సీఎం రేవంత్‌రెడ్డి గారి సూచన మేరకు ధరణి కష్టాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి భూ నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేశాం. రెవెన్యూ చట్టాలను ఈ కమిటీ అధ్యయనం చేసింది. ప్రజల నుంచి చట్టం రావాలనే ఉద్దేశంతో అదే రోజున సీసీఎల్ఏ వెబ్‌సైట్‌లో కూడా ముసాయిదా బిల్లును అందుబాటులో ఉంచాం. దాదాపు పాతిక రోజుల పాటు ప్రజా ప్రతినిధులు, రైతుసంఘాల ప్రతినిధులు, మేధావులు, సామాన్య ప్రజానీకం, రిటైర్డ్ అధికారుల నుంచి సలహాలు, సూచనలను స్వీకరించాం. అన్ని జిల్లాల్లో కలెక్టర్లు సదస్సులు నిర్వహించి అభిప్రాయాలను స్వీకరించారు. చివరకు 2020 చట్టంలో ప్రధాన పాత్ర పోషించిన తన్నీరు హరీశ్‌రావు, మాజీ ఎంపీ వినోద్ కుమార్ సూచనలు కూడా స్వీకరించాం. ఒక చట్టం మీద ప్రజల నుంచి అభిప్రాయాలను స్వీకరించడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమం. భవిష్యత్తులో భూ వివాదాలకు తావు లేకుండా ఎంజాయ్‌మెంట్ సర్వే ద్వారా శాశ్వత పరిష్కారం చేస్తామని అన్నారు. రిజిస్ట్రేషన్ దస్తావేజుల ద్వారా వచ్చే మ్యుటేషన్ జరిగేటప్పుడు ఏవైనా తప్పులు జరిగితే అప్పీల్ చేసుకునే వ్యవస్థ (అథారిటీ)ని ఏర్పాటు చేస్తున్నాం. ఏదైనా పనికొచ్చేదున్నదంటే... రిజిస్ట్రేషన్, ఆ వెంటనే మ్యుటేషన్ జరిగే వెసులుబాటే. కానీ దురదృష్టవశాత్తూ తప్పులకు పరిష్కారం చూపే వ్యవస్థే లేదు. సేల్ డీడ్, వారసత్వం ... కాక కోర్టు ద్వారా వచ్చే, ఓఆర్సీ, 38-ఈ తదితర మొత్తం 14 రకాల భూమి హక్కులపై మ్యుటేషన్ పవర్స్ ను ఆర్డీవో ....సాదా బైనామా ... : 2020 నవంబరు 10 వరకు ఆన్‌లైన్‌లో వచ్చిన సుమారు 9.24 లక్షల దరఖాస్తులకు పరిష్కారం...చూపుతామని అన్నారు. దేశంలో ప్రతీ పౌరుడికి ఆధార్ నెంబర్ ఎలా ఉంటుందో మన రాష్ట్రంలో భూములకూ భూధార్ నంబర్...తెస్తామని అన్నారు. 2014కు ముందు రెవెన్యూ రికార్డుల నిర్వహణ, జమాబందీ ఎలా ఉండేదో ఇకపైనా అదే విధంగా కొనసాగిస్తాం. త్వరలోనే ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక అధికారిని నియమిస్తాం. గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించింది. భూ వివాదాల గ్రీవెన్స్, అప్పీళ్ళ కోసం లాండ్ ట్రిబ్యునల్స్ ఏర్పాటు... అవసరాన్ని, ప్రాంతాన్ని బట్టి సంఖ్యపై ప్రభుత్వ నిర్ణయం...ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆస్తుల్ని, రికార్డుల్ని ఉద్దేశపూర్వకంగా ఎవరైనా తారుమారు చేస్తే సీసీఎల్ఏ ద్వారా రివిజన్ చేసుకునే ఆప్షన్ ను ఈ చట్టంలో పొందుపరుస్తున్నాం. ప్రభుత్వ అధికారులపై చర్యలు: ప్రభుత్వ ఆస్తుల్ని ఉద్దేశపూర్వకంగా తారుమారు చేసే అధికారులపై చర్యలు తీసుకుని శిక్షించే అధికారాన్ని ఈ చట్టం ద్వారా తీసుకొస్తున్నాం అన్నారు.

2014 కి ముందు పాస్ బుక్కులు కలిగి ఉంది అనుభవదారుడిగా పొసిషన్ లో ఉన్న వారు ధరణి తరువాత రోడ్డున పడ్డారు. గత ప్రభుత్వం ఈ అంశాన్ని పూర్తిగా విస్మరించింది. భూ భారతిలో పట్టాదారులు, అనుభవదారులు అభద్రతాభావానికి గురి కావాల్సిన అవసరం లేదు. ఈ చట్టం వీరికి సముచిత స్థానం కల్పిస్తాం.రెవెన్యూ రికార్డులు టాంపరింగ్ జరగకుండా కంప్యూటర్ రికార్డులతో పాటు నిర్ణీత కాల వ్యవధిలో మాన్యువల్ కాపీని కూడా రెవెన్యూ కార్యాలయాలలో భద్రపరుస్తాం అన్నారు. గత ప్రభుత్వం కొన్ని వివరాలను బహిర్గతం కాకుండా లాకర్లలో బంధించింది. ఇప్పుడు భూ-భారతితో ఎవరైనా ఎక్కడి నుంచైనా చూసుకునేలా డిస్‌ప్లే చేస్తున్నాం. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతానికి గురికాకుండా ఎవరైనా భూ భారతి ద్వారా ప్రభుత్వానికి తెలియ చేయవచ్చు. ఆ భూముల్ని పరిరక్షించేలా ఈ చట్టాన్ని రూపొందిస్తున్నాం. భూ-భారతిలో దరఖాస్తు చేసుకున్న భూములున్న ఆసాములకు వారి మొబైల్ నెంబర్లకే అప్‌డేట్స్ వెళ్ళే సౌకర్యాన్ని కల్పిస్తున్నాం. గతంలో ధరణి కారణంగా అన్యాక్రాంతమైన భూముల వివరాలను భూ భారతి ద్వారా బట్టబయలు చేస్తాం. 2014కు ముందు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల దగ్గర ఉన్న ప్రభుత్వ భూముల జాబితాలోని రెవెన్యూ, ఎండోమెంట్, వక్ఫ్, భూదాన్, ఫారెస్ట్ తదితర భూముల వివరాలను ధరణిలోని డేటాతో పోల్చి చూసి అన్యాక్రాంతమైన భూముల వివరాలను బహిర్గతం చేస్తాం. ప్రభుత్వ భూముల్ని ఆక్రమించినవారు ఎంత పెద్దవారైనా వదిలేది లేదు. ఆ భూముల్ని తిరిగి స్వాధీనం చేసుకుని పేదలకు పంచుతాం. రూల్స్ ఫ్రేమ్ అయిన తర్వాత గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సులు పెట్టి అధికారులతో పాటు నేను, సహచర ప్రజా ప్రతినిధులతో కలిసి పరిష్కారాన్ని యుద్ధ ప్రాతిపదికన కనుగొంటాం.అందరికీ ఆమోదయోగ్యంగా తీసుకొస్తున్న భూ-భారతి చట్టం కనీసం వందేళ్ళు వర్ధిల్లుతుందని ఈ ప్రభుత్వం బలంగా నమ్ముతున్నదని మంత్రి వివరించారు.

# అదానీకి ఏజెంట్‌గా కొమ్ముకాస్తున్నావు

మెదటిపేజీ తరువాయి

మొదటి రోజు మమ్మల్ని ఎందుకు అసెంబ్లీ రాకుండా అడ్డుకున్నావు. నిరసన తెలిపే అవకాశం కూడా ఎందుకు ఇవ్వలేదు. మేము అడుగుతున్నా ఎందుకు అసెంబ్లీలో చర్చ పెట్టడం లేదు అని రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు నిలదీశారు. దావోస్ వెళ్లి అదానీతో రూ. 12,400 కోట్ల అగ్రిమెంట్లు చేసుకున్నవు. నీకు నిజంగా అదానీ అవినీతి మీద పోరాటం చేయాలనుకుంటే ముందు వెంటనే అగ్రిమెంట్లు రద్దు చేయ్. నీ మాటల్లో నిజాయితీ ఉంటే, వంద కోట్లు వాపస్ ఇచ్చినట్లు రూ. 12,400 కోట్ల అగ్రిమెంట్ రద్దు చేసుకోవాలి. అగ్రిమెంట్లు రద్దు చేసి నీ చిత్తుశుద్ధిని నిరూపించుకో రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు సవాల్ చేశారు. రామన్నపేటలో డ్రైపోర్టు కోసం ల్యాండ్ ఇస్తే సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతి ఇచ్చావు. అదానీ కోసం పోలీసులను పెట్టి అరెస్టులు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేశావు. పోలీసు పహారా మధ్య పబ్లిక్ హియరింగ్ చేశావు. అదానీకి ఏజెంట్‌గా కొమ్ముకాస్తున్నావు. ప్రజల కోరిక మేరకు సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. డైవర్షన్ పాలిటిక్స్, సర్కస్ ఫీట్లు తప్ప ఇంకే లేదు. మీ డబుల్ స్టాండర్డ్‌కు నిదర్శనం మీ చిత్తశుద్ధి లేని పోరాటం అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. అదానీ దేశ పరువు తీసిండు అని రేవంత్ రాజ్ భవన్ వద్ద అన్నడు. మరి నువ్వు దావోస్ వెళ్లి ఒప్పందాలు చేసుకొని తెలంగాణ పరువు తీశావు. అదానీకి రెడ్ కార్పెట్ వేసి రాష్ట్ర పరువు తీశావు. ఢిల్లీలో పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీ పరువును తీశావు.అదానీ, రేవంత్ అక్రమ సంబంధం మీద రేపు అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేస్తున్నాం. నీకు ఆ ధైర్యమే లేదు. అంతర్గతంగా ఒప్పందం మీకు ఉంది. సీఎం రాజ్ భవన్ వద్ద ట్రాఫిక్ జాం చేసిండు. ధర్నాలో పాల్గొన్న అందరి మీద నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ కేసులు నమోదు చేయాలి. ధైర్యం ఉంటే, చట్టం అందరికి సమానం అయితే వారి మీద కేసులు పెట్టండి అని హరీశ్‌రావు పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీలోకి వచ్చే సభ్యులకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మామ చాటు అల్లుడిగా రూ. పదివేల కోట్లు దోచుకున్న దొంగ హరీష్ రావు అని.. ఆ అవినీతిని మేము నిరూపిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి అన్నారు. ఈ వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. సభ్యులపై ఆరోపణలు చేయొద్దని శాసన సభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు రూలింగ్ బుక్ చూపించి చెప్పారని హరీశ్‌రావు గుర్తు చేశారు. సుద్దులు మాకు చెప్పడం కాదు వారి సహచర మంత్రికి కూడా చెప్పాలి.. వెంకట్ రెడ్డి కమీషన్ లిస్టు చదవమంటే నేను చదువుతాను అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కొంతమంది సభ్యులు డ్రింక్ చేసి సభకు వస్తున్నారని, సభలోకి వచ్చి ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదని అన్నారు. అసెంబ్లీ బయట డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు పెట్టాలని హరీష్ రావు సూచించారు. తెలంగాణలో ఎంబీబీఎస్, బీహెచ్ఎంఎస్ /బీఏఎంఎస్ చేసినవారికి స్థానిక కోటా పరిధిలోనే పీజీ కోర్సుల్లో అడ్మిషన్‌లు కల్పించాల్సి ఉంటుందని హైకోర్టు తేల్చి చెప్పిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. మెడికల్ విద్యార్థులకు జరిగిన నష్టానికి పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. మెడికల్ అడ్మిషన్‌లలో కాంగ్రెస్ ప్రభుత్వం లోకల్ కోటా నిబంధనలు స్థానికుల అవకాశాలను దెబ్బ తీస్తాయని మేము ఆనాడే చెప్పాం. ఈ రోజు కాంగ్రెస్ తెచ్చిన లోకల్ కోట నియమాలను హైకోర్ట్ రద్దు చేసింది. ఎంబీబీఎస్ అడ్మిషన్లు ఆ తప్పుడు నియమాలతో జరిగి నందు వలన వందల మంది స్థానిక అభ్యర్థులకు నష్టం జరిగింది అని హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రం వెలుపల చదివిన, ఇన్‌సర్వీసు అభ్యర్థులకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం అడ్మిషన్‌లు కల్పించాలని హైకోర్టు స్పష్టం చేసింది. పీజీ మెడికల్, పీజీ (ఆయుష్) అడ్మిషన్‌ల నిబంధనలు 2021లోని నిబంధన 8కి సవరణ తీసుకువస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 148, 149లను కొట్టివేస్తూ మంగళవారం 106 పేజీల తీర్పును వెలువరించింది. ప్రభుత్వానికి నిబంధనలు తీసుకురావడంతోపాటు వాటిని సవరించే అధికారం ఉందని, అయితే అది చట్టానికి అనుగుణంగా ఉండాలని పేర్కొంది. తెలంగాణలో విద్యకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు అమల్లోనే ఉన్నాయని తేల్చి చెప్పింది. స్థానిక కోటాకు పీజీ మెడికల్, పీజీ (ఆయుష్) అడ్మిషన్‌లకు సంబంధించి 2021 పీజీ మెడికల్ అడ్మిషన్‌ల నిబంధన-8కి సవరణ తీసుకువస్తూ ప్రభుత్వం అక్టోబరు 28న తీసుకువచ్చిన జీవో 148, 149లను సవాలు చేస్తూ దాదాపు 98 పిటిషన్‌లు దాఖలయ్యాయి. వీటిపై సుదీర్ఘంగా విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం తీర్పును వెలువరించింది. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రపతి ఉత్తర్వులను సవరించడంగానీ, రద్దు చేయడంగానీ చేయలేదని అందువల్ల అన్వయించుకున్నట్టు భావించాలని ధర్మాసనం పేర్కొంది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 95 నేపథ్యంలో తెలంగాణలో రాష్ట్రపతి ఉత్తర్వులు వర్తించవన్న వాదన అంగీకారయోగ్యం కాదని స్పష్టం చేసింది. అందువల్ల చదువులకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు తెలంగాణకు వర్తిస్తాయని స్పష్టం చేసింది.మరోవైపు హరీశ్‌రావు పట్ల పోలీసులు అత్యుత్సాహం చూపించారు. శాసనసభ ప్రవేశ మార్గం వద్ద హరీశ్‌రావును ఆపిన డీఎస్పీ సుదర్శన్.. ఆయన తీసుకెళ్తున్న పేపర్లను తనిఖీ చేయాలని ఆదేశించారు.శాసనసభ ప్రవేశ మార్గం వద్ద హరీశ్‌రావును ఆపిన డీఎస్పీ సుదర్శన్.. ఆయన తీసుకెళ్తున్న పేపర్లను తనిఖీ చేయాలని ఆదేశించారు. కారు తనిఖీ పేరుతో హరీశ్‌రావు తీసుకెళ్తున్న పేపర్లను లాక్కున్నారు. డీఎస్పీ సుదర్శన్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బంది తీరుపై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేం దుర్మార్గమంటూ పోలీసులపై మండిపడ్డారు. ఈ ఘటనపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇంతలా ఎందుకు భయ పడుతుందో అర్థం కావడం లేదని అన్నారు. ప్రజా పాలనలో కంచెలు తొలగించామని అంటూనే.. పోలీసులతో అడుగడుగునా అడ్డుకుంటున్నారని విమర్శించారు. శాసనసభ ప్రవేశమార్గంలో తనతో పోలీసులు వ్యవహరించిన తీరుపై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్సీల వద్ద ఉన్న ప్లకార్లులను మండలిలోకి అనుమతించలేదు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీల వద్ద ప్లకార్డులను పోలీసులు, మార్షల్స్ లాక్కుని.. వారిని లోపలికి పంపించారు. కాగా, ఆటో డ్రైవర్ల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని ఇవాళ బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ఈ క్రమంలోనే కేటీఆర్, జగదీశ్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానంద, పాడి కౌశిక్ రెడ్డి సహా ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఖాకీ దుస్తులు ధరించి ఆటోల్లో అసెంబ్లీకి వచ్చారు. కాగా ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు.. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసింది.ప్రభుత్వ ముందుచూపు లేని విధానాల వల్ల రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు ఉపాధి అవకాశాలు కోల్పోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ తమ వాయిదా తీర్మానంలో పేర్కొంది. కాబట్టి ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ప్రతి ఆటోడ్రైవర్‌కు ఏటా 12వేల రూపాయలు ఆర్థిక సాయం అందించాలని పేర్కొంది. అలాగే ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ.. దీనిపై అసెంబ్లీలో చర్చించాలని ప్రతిపాదించింది.

## లోటుపాట్లు సరిచేసుకుంటాం

మెదటిపేజీ తరువాయి

స్వాధీనం చేసుకుందని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైదరాబాద్ నగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కీలక ప్రకటన చేసింది. హైడ్రా ఏర్పడక ముందు అనుమతిచ్చిన ఏ కట్టడాలనూ హైడ్రా కూల్చదని కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. 'అనుమతి లేకుండా కట్టిన నివాస గృహాలు జులై 2024కి సిద్ధమై, వాటిలో నివాసం ఉంటే హైడ్రా కూల్చదు. ఎఫ్‌టీఎల్‌లో అనుమతులు లేకుండా కట్టిన వాణిజ్య, వ్యాపార కట్టడాలను మాత్రం కూల్చక తప్పదు. గతంలో అనుమతులు ఇచ్చి తరువాత రద్దు చేస్తే అవి అక్రమ కట్టడాలే అవుతాయి. అనుమతులు రద్దైనా నిర్మాణాలు జరుగుతుంటే అక్రమ కట్టడాలుగానే పరిగణిస్తాం అన్నారు. పేదలను ముందు పెట్టి వెనుక నుంచి చక్రం తిప్పుతున్న ల్యాండ్ గ్రాబర్స్ చర్యలను హైడ్రా తీవ్రంగా పరిగణిస్తుంది. మల్లంపేట కొత్వాల్ చెరువు, అమీన్‌పూర్‌లో కూల్చివేసినవి అక్రమ కట్టడాలే. ఎఫ్‌టీఎల్ మార్కింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. కాలనీ సంక్షేమ సంఘాలు, ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు హైడ్రా ప్రాధాన్యత ఇస్తుంది. 12 చెరువుల్లో కూల్చివేతలు చేపట్టాం.. చెరువుల పునరుద్ధరణకు ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే పనులు మొదలు పెడతాం. 5 నెలల అనుభవాల నుంచి హైడ్రా అనేక అంశాలపై స్పష్టమైన వైఖరితో ముందుకెళ్తోంది.

## అంబేద్కర్‌ను అవమానించిందే కాంగ్రెస్

మెదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ సాగించిన అరాచకాలు, ముఖ్యంగా అంబేద్కర్‌ను అవమానించిన తీరును ఇప్పుడు చెప్పే అబద్ధాలతో వారు దాచలేరు. అలా అనుకుంటే వారు పెద్ద పొర బాటు చేసినట్లే. ఎస్సీ, ఎస్టీ వర్గాలను కించపరిచేందుకు రాజవంశం నేతృత్వంలోని ఒక పార్టీ చేసిన ప్రయత్నాలను దేశ ప్రజలంతా చూశారు మనం ఇలా ఉండటానికి అంబేద్కరే కారణం. గత దశాబ్దకాలంగా ఆయన ఆశయాన్ని నెరవేర్చేందుకు మా ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేసింది. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చాం. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని బలోపేతం చేయడం, స్వచ్ఛ భారత్, పీఎం ఆవాస్ యోజన వంటి ప్రధాన కార్యక్రమాలు ప్రతిఒక్కరికీ ఉపయోగపడ్డాయి. అంబేద్కర్‌తో అనుబంధం ఉన్న ఐదు ప్రసిద్ధ ప్రదేశాలైన పంచతీర్థాన్ని అభివృద్ధి చేసేందుకు మా ప్రభుత్వమే కృషి చేసింది. దశాబ్దాలుగా చైత్య భూమికి సంబంధించిన పెండింగ్ లో ఉన్న భూ సమస్యను మా ప్రభుత్వమే పరిష్కరించింది. నేను అక్కడ ప్రార్థనకు వెళ్లాను. అంబేద్కర్ తన చివరి ఏడాదిలో గడిపిన ఢిల్లీలోని 26 అలీపూర్ రోడ్డును మేము అభివృద్ధి చేశాం. లండన్ లో ఆయన నివసించిన ఇంటిని మా ప్రభుత్వమే కొనుగోలు చేసింది. ఆయన్ను సంపూర్ణంగా గౌరవిస్తుంది మేమే. పార్లమెంటులో హోంమంత్రి అమిత్ షా మాట్లాడి కాంగ్రెస్ చీకటి చరిత్రను బయటపెట్టారు. ఆయన మాట్లాడిన వాస్తవాలను చూసి వారు సైతం ఉలిక్కిపడటంతో పాటు ఆశ్చర్యపోయారు. అందుకే ఇప్పుడు వారు నాటకాలాడుతున్నారు. కానీ, ప్రజలకు నిజం తెలుసు' అని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంటులో షా మాట్లాడిన వీడియోను ఆయన పంచుకున్నారు. రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చ సందర్భంగా మాట్లాడిన అమిత్ షా అంబేద్కర్ ను ఉద్దేశిస్తూ పలు వ్యాఖ్యలు చేశారు. దీనిపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. షా దళితులను అవమానించారంటూ కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు ఆరోపించారు. బుధవారం పార్లమెంటు ఆవరణలో అంబేద్కర్ ఫొటో పట్టుకొని నిరసన తెలిపారు. ఆయన హోంమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి.

## రూ. 22,280 కోట్ల విలువైన

మెదటిపేజీ తరువాయి

ఓ ప్రశ్నకు కేంద్ర మంత్రి సీతారామన్ బదులిస్తూ.. విజయవంతంగా ఈడీ సుమారు 22,280 కోట్ల విలువైన ప్రాపర్టీలను సీజ్ చేసినట్లు చెప్పారు. దీంట్లో విజయ్ మాల్యాకు చెందిన 14,131.6 కోట్లు ఆస్తి ఉన్నట్లు తెలిపారు. ఇక నీరవ్ మోదీ కేసులో 1,052.5 కోట్ల ఆస్తుల్ని బ్యాంకులు జప్తు చేసుకున్నట్లు చెప్పారు. నేషనల్ స్పాట్ ఎక్స్‌చేంజ్ స్కామ్‌లో 17.47 కోట్లు బ్యాంకులు సీజ్ చేశాయన్నారు. ఎస్ఆర్ఎస్ గ్రూపుకు చెందిన 20.15 కోట్లు, రోజ్ వాలీ గ్రూపుకు చెందిన 19.40 కోట్లు, సూర్య ఫార్మసీకి చెందిన 185.13 కోట్లు, నౌషేరా షేక్ గ్రూపుకు చెందిన 226 కోట్లు, నాయుడు అమృతేశ్ రెడ్డికి చెందిన 12.73 కోట్ల ప్రాపర్టీలను బ్యాంకులు స్వాధీనం చేసుకున్నాయి. మోహుల్ చోక్సీకి చెందిన 2,565.90 కోట్ల విలువైన ప్రాపర్టీలను బ్యాంకులు స్వాధీనం చేసుకున్నట్లు మంత్రి వెల్లడించారు.

## టీజీ టెట్2024 పరీక్షల షెడ్యూల్ విడుదల

మెదటిపేజీ తరువాయి

నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. జనవరి 2వ తేదీన ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో సోషల్ స్టడీస్(పేపర్-2) పరీక్ష నిర్వహించనున్నారు. జనవరి 5న ఉదయం సెషన్‌లో సోషల్ స్టడీస్(పేపర్ -2), మధ్యాహ్నం సెషన్‌లో మ్యాథమేటిక్స్ అండ్ సైన్స్(పేపర్-2) పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# అవినీతిపై చర్యకు ప్రధాని వెనకడుగుఅవినీతిపై చర్యకు ప్రధాని వెనకడుగు

హైదరాబాద్,డిసెంబర్18ప్రజాక్షేత్రం: భారత వ్యాపార వ్యవస్థలు అవినీతిలో కూరుకు పోయాయని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. వ్యాపారాలు చేయాలంటే లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ 75 ఏళ్లుగా దేశ ప్రతిష్ఠను పెంపొందించిందని చెప్పారు. అదానీ, ప్రధాని కలిసి దేశం పరువు తీశారని ఆరోపించారు. ప్రపంచ దేశాల ముందు భారత్ పరువును తాకట్టుపెట్టారని ఆక్షేపించారు. ఆదానీని ప్రధాని వెనకేసుకుని వచ్చినా, అమెరికా మాత్రం వదలదని హెచ్చరించారు. ఆదానీపై చర్యలకు ఢిల్లీలో కూడా ధర్నాకు వెనకాడబోమని సిఎం రేవంత్ హెచ్చరించారు. మణిపుర్ అల్లర్లు, అదానీపై వచ్చిన ఆర్థిక అవకతవకల ఆరోపణల అంశంలో కేంద్రం వైఖరికి నిరసనగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు 'చలో రాజ్‌భవన్' చేపట్టారు. ఈ సందర్భంగా రాజ్‌భవన్ సమీపంలో సీఎం బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. 'అదానీ సంస్థలు అమెరికాలో లంచాలు ఇవ్వజూపాయి. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎఫ్‌బీఐ నివేదించడంతో అక్కడి ప్రభుత్వం చర్యలకు పూనుకుంది. దేశం పరువును మంటగలిపిన అదానీపై విచారణ జరగాలి. దీనిపై విచారణకు జేపీసీ నేతృత్వం వహించాలి. అదానీ అవినీతిపై చర్చ, జేపీసీ వేసేందుకు కేంద్రం సిద్ధంగా లేదు. అలా చేస్తే అదానీ జైలుకి వెళ్లాల్సి వస్తుంది. ఆయన్ను కాపాడేందుకు ప్రధాని మోదీ యత్నిస్తున్నారు. ఈ అంశంపై జేపీసీ వేయకపోతే రాష్ట్రపతి భవన్ వద్ద ధర్నా చేస్తాం అని రేవంత్‌రెడ్డి అన్నారు. 75 ఏళ్లు కష్టపడి దేశ ప్రతిష్టను కాంగ్రెస్ పెంచితే.. ప్రధాని మోడీ, ఆయన మిత్రుడు అదానీ కలిసి దేశ పరువు తీశారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నెక్లస్ రోడ్ నుండి రాజ్ భవన్ వరకు కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున ర్యాలీ తీసి రాజ్ భవన్ రూట్‌లో బైఠాయించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, దీపాదాస్ మున్షీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. వ్యాపారం చేసేందుకు బిలియనీర్ అదానీ లంచాలు ఇచ్చినట్లు అమెరికా దర్యాప్తు సంస్థలు తేల్చాయి.. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిలదీశారు.. కానీ ప్రధాని మోడీ దీనిపై మౌనంగా ఉంటున్నారని అన్నారు. అదానీతో ప్రధాని మోడీకి లాలూచీ ఒప్పందం ఉందని.. అందుకే అదానీ కాపాడటానికి ఆయన ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ పిలుపు మేరకు రాజ్ భవన్ ముట్టడించామని తెలిపారు. మా పోరాటం ఇక్కడితో ఆగదని.. అదానీ అంశంపై జేపీసీ ఏర్పాటు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రపతి భవన్ ముందు ధర్నా చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వమే ధర్నాలు చేయడం ఏంటని కొందరు ప్రశ్నిస్తున్నారు.. కానీ దేశ ప్రతిష్టను కాపాడుకోవడానికే రోడ్డుపై నిరసన తెలపాల్సి వచ్చిందన్నారు. పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపైనే నిరసన చేపడుతున్నామని స్పష్టం చేశారు. విధిలేని పరిస్థితుల్లోనే మేం ధర్నా చేపట్టాల్సిన పరిస్థితి వచ్చిందని.. ముఖ్యమంత్రి ధర్నా చేస్తారా అని బీఆర్ఎస్ అంటోంది.. నేను ధర్నా చేయను.. మరీ వాళ్లు వచ్చి చేస్తారా అని ప్రశ్నించారు. అదానీ అంశంపై బీఆర్ఎస్ వైఖరి ఏంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ సై అంటే అసెంబ్లీలో ఆదానీ అంశంపై చర్చించి తీర్మానం చేస్తామని అన్నారు. ప్రధాని మోడీ ఆశీస్సులతో ఆయన మిత్రుడు, బిలియనీర్ గౌతమ్ అదానీ దేశ సంపద దోచుకుంటున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని అదానీ దేశ ప్రజల సొమ్ము దోచుకుంటున్నారని ఆరోపించారు. అదానీ దేశ ప్రజలను సొమ్మును ఏ విధంగా దోచుకుంటున్నారు.. బ్యాంకులను ఓ విధంగా మోసం చేశారో హిండెన్ బర్గ్, అమెరికా న్యాయవాదులు చెప్పారని గుర్తు చేశారు. అదానీ ఆర్థిక అవకతవకలపై పార్లమెంట్‌లో చర్చ కోసం కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తోన్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఫైర్ అయ్యారు. కొన్ని నెలలుగా జాతుల మధ్య అల్లర్లతో మణిపూర్ అట్టుడికిపోతున్న మోడీ నోరు విప్పడం లేదని విమర్శించారు. ఈ క్రమంలోనే అదానీ ఇష్యూ, మణిపూర్ అల్లర్ల విషయంలో ప్రధాని మోడీ మౌనాన్ని నిరసిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా ఆందోళనలకు దిగామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నేతలు దీనిలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. అనంతరం రాజ్‌భవన్ సమీపంలో రోడ్డుపై సీఎం రేవంత్, మంత్రులు, నేతలు బైఠాయించి నిరసన తెలిపారు.

### ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు

- రోడ్డు ప్రమాద బాధితులకి ఆర్థిక సాయం అందించిన ముదునూరి





**ప్రత్తిపాడు,డిసెంబర్ 18 (ప్రజాక్షేత్రం):**

ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు ముదునూరి మురళీ కృష్ణంరాజు సామాజిక సేవలో ముందున్నారు.తమ ట్రస్ట్ ద్వారా నియోజకవర్గంలోని పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మురళీ కృష్ణం రాజు తెలిపారు.ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ బ్రహ్మాజీ భార్యను మరియు బొమ్మిడాల రాజునూ పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో జువ్వల దొరబాబు,పోకనాటి వెంకన్న,బొల్లు నాగేశ్వరరావు,మాగాపు శివ, యాళ్ల యేసు తదితరులు పాల్గొన్నారు.

## ఏలేశ్వరంలో కామ్రేడ్ వినోద్ మిశ్రా 26వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**ఏలేశ్వరం, డిసెంబర్ 18 (ప్రజాక్షేత్రం):**

కామ్రేడ్ వినోద్ మిశ్రా 26వ వర్ధంతిని పురస్కరించుకొని సిపిఐ ఎంఎల్ వినోద్ మిశ్రా పార్టీ నాయకత్వంలో ఆ పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొసిరెడ్డి గణేశ్వరరావు ఆధ్వర్యంలో ఏలేశ్వరం బాలాజీ చౌక్ సెంటర్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ ర్యాలీగా వినోద్ మిశ్రా కాలనీకి వెళ్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు.ఆయన ఆశయాలను స్మరిస్తూ అమరవీరుల త్యాగాలను మరోసారి స్మరిస్తూ జోహార్లు అర్పిస్తూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా కొసిరెడ్డి గణేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల మధ్యలో వినోద్ మిశ్రా లేకపోయినా ఆయన ఆశయాలే లక్ష్యంగా పని చేస్తామన్నారు.ఎన్డిఏ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల కబంద హస్తాలలో నడుస్తూ కులం,మతం పేర్లతో ప్రజలను విభజించి అధికారం కోసం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.గత వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన పథకాలను కూడా కూటమి ప్రభుత్వం అమలుచేయకుండా పబ్బం గడుపుతుందని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు గండేటి నాగమణి,గుమ్మడి పాదాలమ్మ,సోమల కుశల, నాగులపల్లి అర్జునుడు,దళిత నాయకుడు మశరపు రాజారావు, మాడెం బాబురావు, గునాపు సాయి,కందుల క్రాంతి కుమార్,సందక ప్రసాద్. ఇండిగిబిల్లి వంశీ,పందిరి సుబ్బారావు,కాకర అర్జున్.ల, పందిరి ధర్మరాజు,గుమ్మడి రాజేష్,వడ్డాది గంగ తదితరులు పాల్గొన్నారు.

### సెమ్స్‌లో వైజాగ్ జనరల్ కార్గో బెర్త్ (VGCB) సహకారంతో ఉచిత ఉపాధి శిక్షణ కార్యక్రమం మొదటి బ్యాచ్‌కి నియామక పత్రాలు అందజేసిన విశాఖ సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



**విశాఖదక్షిణం,డిసెంబర్ 18(ప్రజాక్షేత్రం):**

సెమ్స్‌లో వైజాగ్ జనరల్ కార్గో బెర్త్ సహకారంతో ఉచిత ఉపాధి శిక్షణ కార్యక్రమం మొదటి బ్యాచ్‌కి నియామక పత్రాలు అందజేత కార్యక్రమం వైజాగ్ జనరల్ కార్గో బెర్త్ కార్పొరేట్ సామాజిక బాధ్యత లో భాగంగా షిప్పింగ్ మరియు జలమార్గాల మంత్రిత్వ శాఖ స్థాపించిన సెంటర్ అఫ్ ఎక్సెన్స్ ఇన్ మారిటైం అండ్ షిపిబిల్డింగ్ (సెమ్స్) సహకారంతో పోర్ట్ పరిసర ప్రాంత మరియు జీవీఎంసీ పరిధిలోని 90 మంది నిరుద్యోగ యువతి యువకులకు ఉపాధి ఆధారిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా మొదటి బ్యాచ్లో శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు నియామక పత్రాలను దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశి కృష్ణ శ్రీనివాస్ చేతులమీదుగా అందచేయటం జరిగిందని సెమ్స్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ కే. సేతు మాధవన్ ఒక ప్రకటనలో తెలిపారు. చీఫ్ గెస్ట్‌గా విచ్చేసినవంశి కృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ చీఫ్ మినిస్టర్ ఆదేశానుసారం కూటమి ప్రభుత్వం ఏడాదికి 1,20,000 మంది నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ఉపాధి కల్పించటం లక్ష్యంగా పెట్టుకుందని దీనిలో భాగంగా సెమ్స్ లాంటి సంస్థల అవసరం ఎంతో ఉందని, విజయవంతంగా శిక్షణ కార్యక్రమం పూర్తి చేసుకున్న మహిళా అభ్యర్థులను అభినందిస్తూ సభాముఖంగా చెప్పటం జరిగింది. వీజీసీబీ సంస్థ సీఈఓ శ్రీ పవన్ కుమార్ మాట్లాడుతూ, మొదటి బ్యాచ్ లో 30 మంది మహిళా అభ్యర్థులకు ఇన్వెంటరీ కంట్రోలర్ కోర్సులో శిక్షణ ఇచ్చామని మరియు 30 మందితో ఎలక్ట్రీషియన్ బ్యాచ్ ఈ రోజు నుండి ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీజీసీబీ సిఎస్ఆర్ హెడ్ కుమారి శ్రీలక్ష్మి, కుమారి క్రీన విపుల్ మరియు సెమ్స్ నుండి కమాండర్ గోపి కృష్ణ శివ్వం, (రిటైర్డ్), ప్రాజెక్ట్ హెడ్ శ్రీ ప్రజీత్ కురుప్ తో పాటు వెస్ట్ జనసేన పార్టీ ఇన్చార్జి, స్టేట్ డైరెక్టర్ శ్రీమతి ప్రశాంతి , స్థానిక కార్పొరేటర్ సురేష్ పాల్గున్నారు.

# డిసెంబరు 28, 29 సిపిఎం విశాఖ జిల్లా మహాసభలు

- 28న పెందుర్తిలో భారీ ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయండి
- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పిలుపు



**విశాఖపట్నం,డిసెంబర్ 18(ప్రజాక్షేత్రం):**

డిసెంబర్ 28, 29న సిపిఎం విశాఖ జిల్లా మహాసభలు సుజాత నగర్‌లో జరుగనున్నాయని, 28 తేదీన ఉదయం 10 గంటలకు పెందుర్తి జూనియర్ కాలేజీ నుండి సుజాత నగర్ వరకు భారీ ప్రదర్శన జరుగుతుందని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. ఈ ప్రదర్శన,బహిరంగ సభను ప్రజలు,కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం జగదాంబ దరి నండూరిప్రసాదరావు భవన్‌లో సిపిఎం జిల్లా కమిటీ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, సీనియర్ నాయకులు ఎస్.జ్యోతీశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావులు పాల్గొని మహాసభల గోడపత్రికను విడుదల చేసారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ గత మూడేళ్ళ కాలంలో నిర్వహించిన కార్మిక, ప్రజా పోరాటాలను ఈ మహాసభల్లో సమీక్షించుకొని రాబోయే మూడేళ్ళ కాలంలో చేపట్టబోయే ఉద్యమ ప్రణాళిక విడుదల చేస్తుందన్నారు. గత వైసిపి ప్రభుత్వం ప్రజలపై వేసిన ఆస్థిపన్ను, చెత్తపన్ను, విద్యుత్ ఛార్జీల భారాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి ఉద్యమించిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకై ఉత్తరాంధ్ర బైక్‌యాత్ర, నిరాహారదీక్షలు, అనేక రూపాల్లో నిరసనలు చేపట్టి ప్రైవేట్‌కాకుండా అడ్డుకోగల్గామన్నారు. కుసులవాడ మైనింగ్, ముడసర్లోవ, దసపల్లా, ఎర్రమట్టిదిబ్బల భూ కుంభకోణాలపై నిఖరంగా ఉద్యమించిందన్నారు. సంఘటిత, అసంఘటితరంగ కార్మికుల సమస్యలపై అనేక పోరాటం చేయడమే కాకుండా కార్మికవర్గం చేపట్టే పోరాటాలలో ప్రత్యక్షంగా పాల్గొని మద్దతిచ్చిందన్నారు. విశాఖపట్నంలో కొండవాలు ప్రాంతాలు, మురికివాడ ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సిపిఎం గొంతెంత్తిందన్నారు. టిడిపి, వైసిపి ప్రభుత్వాలు పేదలకు ఇళ్ళు, ఇళ్ళ స్థళాలు ఇస్తామని చెప్పి మోసగించడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తూ పేదలకు ఇళ్ళు, ఇళ్ళపట్టాలు ఇవ్వాలని ఉద్యమించిందన్నారు. ఈ మహాసభల్లో ఈ పోరాటాలను సమీక్ష చేపట్టి రాబోయే మూడేళ్ళకాలంలో టిడిపి కూటమి ప్రభుత్వం, కేంద్ర బిజెపి ప్రభుత్వం వేయబోయే విద్యుత్ ఛార్జీలు, స్మార్ట్‌మీటర్లుకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ప్రారంభించిందన్నారు. విశాఖ సమగ్రాభివృద్ధి, కార్మికులు, మహిళలు, యువత, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలకు సిద్ధమవుతోందన్నారు. జగనన్న ఇళ్లు, టిడ్కో వంటి ఇళ్ళకు పేదలకు ఇప్పటికే డిడిలు రూపంలో డబ్బులు చెల్లించినందున ఇళ్ళసాధనకై ప్రజా ఉద్యమానికి రూపకం చేస్తోందన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

# కాంగ్రెస్ పార్టీలోకి యూత్ చేరికలు

**భీంగల్,డిసెంబర్18 (ప్రజాక్షేత్రం):**

భీంగల్ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యూత్ టౌన్ ప్రెసిడెంట్ నీలం రవి,బీఆర్ఎస్ యూత్ నాయకులు నరేష్,రాజు,సీహెచ్ రాకేష్,బిట్టు,సురేష్, మహేష్,మజ్జు,అక్రం మరికొంత మంది బుధవారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో జరుగుతున్న ప్రజాపాలనకు ఆకర్షితులై బాల్కొండ నియోజకవర్గంలో ముత్యాల సునీల్ కుమార్ నాయకత్వములో ప్రజాపాలనలో,ప్రజా సేవలో పాలుపంచుకోవడానికి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారందరికీ ముత్యాల సునీల్ కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా నీలం రవి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు మెచ్చిన పాలన,ప్రజల ఆకాంక్ష మేరకు పరిపాలన జరుగుతుందని, బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మనసున్న నాయకుడిగా పేరు సంపాదించారని ఆయన నాయకత్వంలో పని చేయడానికి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు తెలిపారు.భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు .ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోదిరె స్వామి, టౌన్ అధ్యక్షుడు నర్సయ్య,కన్నె సురేందర్,మల్లెల లక్ష్మణ్, అనంత రావ్,ఇక్రమ్, సాయిబాబా,పల్లె శేఖర్, కోరాడి లింబాద్రి, పొల్సాని రంజిత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



### వెన్నా శివ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సత్యప్రభని కలిసిన నాయకులు



**శంఖవరం,డిసెంబర్ 18 (ప్రజాక్షేత్రం):**

కాకినాడ జిల్లా, శంఖవరం మండలం,కత్తిపూడి గ్రామానికి చెందిన వెంకన్న దొర చెరువు నీటి సంఘం చైర్మన్, దేశలంక వెంకటలక్ష్మివైస్ చైర్మన్,ఉప్పిలి దుర్గ మరియు సభ్యులు టిఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు వెన్నా శివ ఆధ్వర్యంలో ప్రత్తిపాడులో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే సత్యప్రభ అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

### ఎన్నారం గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ల అందజేత కార్యక్రమం నిర్వహణ



**వికారాబాద్,డిసెంబర్ 18( ప్రజాక్షేత్రం):**

ఈరోజు వికారాబాద్ నియోజకవర్గం కోట్ పల్లి మండలం ఎన్నారం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి,వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు గట్టుమిది అనిత భర్త దేవయ్య కు 52500/- రూపాయలు సీఎంర్ఫ్ చెక్ ను ఇవ్వడం జరిగింది. ఈకార్యక్రమంలో గ్రామం కమిటీ అధ్యక్షులు బోయినిఅంజయ్య,మాజీ ఎంపీటీసీ పటోళ్లవీణ నర్సింహా రెడ్డి,కోట్ పల్లి మండలం యూత్ కాంగ్రెస్ నాయకులు జడలగోవర్ధన్,మాజీ ఉప సర్పంచ్ ఎస్పీకాజామియా,కావాలి అనంత్తయ్య,బేగరినర్సిములు, సలావుద్దీన్, చిటేపుఅంజిరెడ్డి,వెల్చాల్ నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వాడి అనారోగ్యానికి గురి కావద్దు

- ఒక్క సారి వాడి వదిలేసే ప్లాస్టిక్ వద్దేవద్దు
- ఎకో వైజాగ్, మిషన్ లైఫ్‌లను జయప్రదం చేద్దాం
- ఎన్ ప్రేమ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి, విశాఖపట్నం



**విశాఖపట్నం, డిసెంబర్ 18(ప్రజాక్షేత్రం):**

ఒక్కసారి వాడి వదిలేసిన ప్లాస్టిక్ వాడి అనారోగ్యానికి గురి కావద్దు అని విశాఖపట్నం జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ ప్రేమ కుమార్ కోరారు. జి వి‌ఎంసి కమిషనర్ సంపత్ కుమార్ ఆదేశాలు అనుసరించి బుధవారం ఉదయం ఈస్ట్ పాయింట్ కాలనీలోని కెడిపిఎమ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాల మీద గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఓ మాట్లాడుతూ ఈ ప్లాస్టిక్ వినియోగం వల్ల అనేక అనారోగ్య సమస్యలు ప్రభలుతున్నాయి ఒక్క సారి వాడి వదిలేసె ప్లాస్టిక్ వద్దెవద్దు అని జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ జిల్లా వ్యాప్తంగా విభిన్న కార్యక్రమాలు నిర్వహించడం జరిగుతోంది అన్నారు. ఎస్ ఆర్ యు - జి విఎంసి ప్రోజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస రాజమణి ఈ సందర్భంగా మాట్లాడుతూ జనవరి ఒకటి నుంచి ఒక్క సారి వాడి వదిలేసె 16 రకాల ప్లాస్టిక్ పై పూర్తి ఆంక్షలు అమలు చేయడం జరుగుతుంది అన్నారు. ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్ ప్రపంచానికి పెద్ద సవాల్‌గా మారింది అన్నారు.దీనిని దృష్టి లోనికి తీసుకొని విద్యార్థులు అందరూ ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలు తమ కుటుంబీకులకు వివరించి వాటి వినియోగానికి అడ్డుకట్ట వేయాలన్నారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం మాట్లాడుతూ వాడి వదిలేసే ప్లాస్టిక్ కాల్చడం వల్ల అనేక రకాల విష తుల్య రసాయనాల కాలుష్యం వల్ల జీవ వైవిధ్యానికి, భవిష్యత్తు తరాలకు కలిగే నష్టాలు వర్ణనాతీతం అని వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం సుమతీ బాయి, తెలుగు ఉపాధ్యాయుని సత్యవతి తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఒక్క సారి వాడి వదిలేసె ప్లాస్టిక్ వద్దెవద్దు, మానవాళి జీవించడానికి మరో భూ గోళం లేదని నినాదాలు పలికారు.

## ఇండ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలి

- సిపిఐ జాతీయ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి



**శేరిలింగంపల్లి డిసెంబర్ 18 (ప్రజాక్షేత్రం):**

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసి కోరారు. అనంతమైన వినతిపత్రం అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో గత 20 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్న పేదలకు డబల్ బెడ్ రూమ్ ఇందిరమ్మ ఎలాంటి షరతులు లేకుండా మంజూరు చేయగలరని రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కి వినతి పత్రం, పేర్ల జాబితా ఇవ్వడం జరిగింది. సానుకూలంగా స్పందించిన మంత్రి గత ప్రభుత్వం. డబల్ బెడ్ రూమ్ ఇస్తానని నట్టేట ముంచారని ఇప్పుడైనా ప్రజాపాలన సాగిస్తున్న మీరు తప్పకుండా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కామ్రేడ్ పాలమాకుల జంగయ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ రవీంద్ర చారి రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు రాష్ట్ర సమితి సభ్యులు రామస్వామి జిల్లా కార్యవర్గ సభ్యులు టి రామకృష్ణ. జిల్లా కౌన్సిల్ సభ్యులు కే చందు మహిళా సమైక్య శేరిలింగంపల్లి కార్యదర్శి కే లక్ష్మి ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు, జట్టి శ్రీనివాస్, కే వెంకటస్వామి, కే శివకుమార్ వెంకటేష్ ఎస్ కొండలయ్య, బి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలి

- ఎస్ ఎఫ్ ఐ నాయకులు





**వలిగొండ,డిసెంబర్ 18 (ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండలం పరిధిలోని లోతుకుంట లో గల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలిగొండ మోడల్ స్కూల్ ను జిల్లా విద్యాధికారి వెంటనే సందర్శించి దాడికి పాల్పడ్డ ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకొని గాయపడ్డ విద్యార్థులను పరామర్శించాలన్నారు. పాఠశాలలో ప్రిన్సిపాల్ ను కలిసి విచారించి గాయపడిన విద్యార్థులతో మాట్లాడారు.

ప్రజాక్షేత్రం PRAJA KSHETRAM

గురువారం 19 డిసెంబర్ 2024

# ఎంపీడీవో కు సోకాజ్ నోటీసు జారీ చేసిన జిల్లా కలెక్టర్

**చింతపల్లి,డిసెంబర్ 18(ప్రజాక్షేత్రం):**



ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలనలో నిర్లక్ష్యం వహించడం, కిందిస్థాయి సిబ్బందికి యాప్ వివరాల నమోదుపై అవగాహన కల్పించనందుకు గాను నల్గొండ జిల్లా, చింతపల్లి ఎంపీడీవో సుజాతకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ చింతపల్లి మండలం, ఘూసిరాం తండా, నసర్లపల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని తనిఖీ చేశారు.ముందుగా జిల్లా కలెక్టర్ మండలంలోని ఘూసిరాం తండాలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు దారు ఇండ్ల కు వెళ్లి సర్వే బృందం యాప్ లో నమోదు చేసిన వివరాలను సెల్ఫోన్ ద్వారా పరిశీలించారు. రమావత్ .శంకర్, కోర్ర .సరిత తదితర దరఖాస్తుదారుల ఇళ్లను పరిశీలించి అక్కడ వివరాల నమోదు చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ దరఖాసుదారుల ఇంటితో సహా తీసుకున్న ఫోటో, అలాగే ఇంటి ధృవపత్రాల అప్లోడింగ్ వివరాలను అడగగా, ఫోటో అప్లోడ్ చేయకపోవడం, ధ్రువపత్రాలు లేక తాత్కాలిక అప్లోడ్ చేయడాన్ని గమనించిన జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో సిబ్బందికి యాప్ పరిశీలనపై ముందే అవగాహన ఎందుకు కల్పించలేదని, సర్వే పై గ్రామంలో ముందే ప్రజలకు చెప్పకపోవడం పై ఎంపిడిఓపై ఆగ్రహం వ్యక్తం చేసి షోకాజ్ నోటిస్ జారీ చేయాల్సిందిగా ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలనకు సర్వే బృందాలు వచ్చినప్పుడు గ్రామాలలో తప్పనిసరిగా దరఖాస్తు దారు ఇంటి వద్ద ఉండాలని, ఇంటి ముందు నిలబడి ఫోటోతో సహా యాప్ లో అప్లోడ్ చేసేలా ఫోటో దిగాలని, అంతేకాక ఇంటికి సంబంధించిన ధ్రువపత్రాలు, ఆధార్ తదితర దృవపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని పునరుద్ఘాటించారు. సర్వే బృందాలకు ఏ రోజు సర్వే నిర్వహించే ఇండ్ల దరఖాస్తుల వివరాల డాటాను మాత్రమే అప్లోడ్ చేయాల్సిందిగా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్ కుమార్ ను ఆదేశించారు. మాస్టర్ డేటాను సర్వే బృందాలకు ఇవ్వడం వల్ల వారు అయోమయానికి గురయ్యే అవకాశం ఉంటుందని, అందువల్ల సంబంధిత గ్రామానికి సంబంధించి ,ఆ రోజు సర్వే నిర్వహించే ఇళ్లకు సంబంధించిన వివరాలు మాత్రమే ఆరోజు అప్లోడ్ చేయాలన్నారు. గతంలో ఏదైనా కారణం చేత ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా దరఖాస్తు చేసుకో లేకపోయిన వారు ఇప్పుడు ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలలో ఏర్పాటుచేసిన ప్రజా పాలన మీ–సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఇదే మండలం నసర్లపల్లి గ్రామంలో సైతం ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే ను పరిశీలించారు. దరఖాస్తు దారు లక్ష్మమ్మ ఇంటికి వెళ్లి ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లా? ఆర్ సి సి న లేక పెంకుటిళ్ల అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వే బృందం వచ్చినపుడు లక్ష్మమ్మ అందుబాటులో లేకపోవడంతో ఆమెను పిలిపించి ఫోటో దింపాలని సర్వే బృందానికి సూచించారు. ఇందిరమ్మండ్ల దరఖాస్తుల పరిశీలనకు సంబంధించి ఏవైనా సందేహాలు తలెత్తినట్లయితే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 18004251442 నెంబర్ కు ఫోన్ చేసి తెలియజేయాలని కలెక్టర్ ప్రజలకు తెలిపారు.అలాగే అధికారులు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, సిబ్బంది దరఖాస్తుల పరిశీలనకు సంబంధించిన సందేహాలను ఈ నెంబర్ కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, సర్వే బృందాలు తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్ షా మనువాద వ్యాఖ్యలను ఖండించండి

- అమిత్ షా దేశప్రజలకు క్షమాపణ చెప్పాలి
- కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్



**కొండాపూర్ ప్రజాక్షేత్రం డిసెంబర్ 18**

కేంద్ర హెూం శాఖా మంత్రి అమిత్ షా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ను పార్లమెంటు సాక్షిగా అవమానించారని, ఎగతాళి చేసి అహంకారంగా మాట్లాడటాన్ని ప్రజలు ప్రజాస్వామిక వాధులు ఖండించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్షులు అతిమేల మానిక్ పేర్కొన్నారు.ఈ మేరకు కేవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జిల్లా అధ్యక్షులు అతిమేల మానిక్ కార్యదర్శి అశోక్ లు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. .వారు మాట్లాడుతూ అమిత్ షా అంబేద్కర్ పట్ల ఆర్ ఎస్ ఎస్ బీజేపీ కి ఉన్న అవగాహణనను వ్యక్తం చేశారని అట్టడుగు వర్గాల పట్ల వారి వైఖరిని చెప్పారని అన్నారు దుర్మార్గమైన దారుణమైన అహంకార చర్యను అందరూ ఖండించాలన్నారు .ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ వద్ద నిరసన తెలపడం హర్షణీయమన్నారు.ఈ మతోన్మాద చర్యను కెవిపియస్ ఖండిస్తుందన్నారు. అమిత్ షా క్షమాపణ చెప్పాలన్నారు. ఎన్నిసార్లు అంబేద్కర్ అని పదే పదే అతడిని స్మరించుకుంటారు దానికి బదులుగా ఏదో ఒక హిందూ దేవుడిని స్మరించుకుంటే మీకు 7 జన్మలకు స్వర్గం దక్కుతుందనడం సిగ్గు చేటన్నారు. అలా అనటమే కాకుండా మాటి మాటికీ అంబేద్కర్ పేరు ఎత్తడం వీళ్లకు పెద్ద ఫ్యాషన్ అయిపోయిందని ఏగతాళిగా మాట్లాడటం తగదన్నారు. ఎన్నికల ముందు అంబేద్కర్ పేరు జపం చేసి అధికారం లోకి వచ్చాక ఆయన పేరు ఎత్తకూడదని చెప్పటం సిగ్గు చేటన్నారు . నేటి మనువాద మతోన్మాద ప్రభుత్వంలో రాజ్యాంగం పై, ప్రభుత్వరంగ సంస్థలపై దాడి జరుగుతుందన్నారు.ఈ దాడులను వ్యతిరేకిస్తూ రాజ్యాంగాన్ని కాపాడుకోవలిసిన అవసరం ఉందన్నారు.

## నల్ల చెరువును నడక వ్యాయామాలకు అభివృద్ధి పరచాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి



**వనపర్తి డిసెంబర్ 19(ప్రజాక్షేత్రం):**

వనపర్తి పట్టణంలోని నల్ల చెరువును పట్టణ ప్రజలకు నడక, వ్యాయామం చేసుకునేందుకు వీలుగా అభివృద్ధి చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ (లోకల్బాడీస్) సంచిత్ గంగ్వార్, మున్సిపల్ చైర్మన్ పి. మహేష్, మున్సిపల్ అధికారులతో కలిసి నల్ల చెరువును సందర్శించారు. పట్టణ ప్రజలకు, ఉదయం, సాయంత్రం కాలి నడక, వ్యాయామం చేసుకునేవిధంగా కట్టను అభివృద్ధి చేయాలని అందుకు అవసరమైన డిపిఆర్ ను సిద్ధం చేసి ప్రతిపాదనలు ఇవ్వాల్సిందిగా మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బ్రిడ్జిపై నుండి భారీ వాహనాలు నడవకుండా గేట్ పెట్టాలని సూచించారు. ప్రజలు నడకతో పాటు వ్యాయామం చేసుకునే విధంగా ఓపెన్ జిమ్, పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ఆట వస్తువులు, రెండు దిక్కుల అందమైన మొక్కలు వంటివి అభివృద్ధి చేయాలని సూచించారు.అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, మున్సిపల్ చైర్మన్ మహేష్, మున్సిపల్ కమిషనర్ పూర్ణ చందర్, వైస్ చైర్మన్ కృష్ణ, మున్సిపల్ డి ఈ యునస్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి

- ఎంఎన్ జె, సన చారిటబుల్ ట్రస్ట్ సేవలు హర్షనీయం.
- మునిసిపల్ కార్యాలయంలో క్యాన్సర్ నిర్ధారణ క్యాంపును ప్రారంభించిన కలెక్టర్.




**వనపర్తి డిసెంబర్ 19(ప్రజాక్షేత్రం):**

క్యాన్సర్ రహిత మహిళల కోసం సన చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ప్రముఖ ఎమ్ ఎన్ జే క్యాన్సర్ ఆసుపత్రి వారు వనపర్తి లో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల క్యాంపును ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం అని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. బుధవారం మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాంపును అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, సన చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యులు సురభి సత్తయ్య, సురభి నరసమ్మలతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సన చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తమ కుటుంబ సభ్యులు క్యాన్సర్ బారిన పడి మృత్యువాత పడడంతో తీవ్రంగా చలించిపోయిన వారు మిగతా మహిళలు క్యాన్సర్ బారిన పడవద్దనే ఉద్దేశంతో ప్రముఖ ప్రభుత్వ ఎంఎన్జే క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా వనపర్తిలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల క్యాంపును ఏర్పాటు చేశారని ఈ క్యాంపు ద్వారా అనుమానిత మహిళలు తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామీణ మహిళలకు 102 వాహనం ద్వారా తరలివచ్చి నిర్ధారణ పరీక్షలు చేయించుకునే వెసులుబాటు కల్పించామన్నారు. మునిసిపాలిటీ లో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేసే మహిళలు మామోగ్రఫీ యంత్రాల ద్వారా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ నిపున్ కుమార్, క్యాన్సర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సాయినాథ్ రెడ్డి, రామచంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీలు తమ హక్కులను తెలుసుకోవాలి

- జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బీరువాల భాష




**ఆళ్లగడ్డ,డిసెంబర్ 18, (ప్రజాక్షేత్రం):**

మైనార్టీ సోదరులు తమ హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బీరువాల భాష అలియాస్ హుస్సేన్ వల్లి మరియు ఆవాస్ కమిటీ నాయకులు నిజాముద్దీన్ పేర్కొన్నారు. ఈరోజు ఆళ్లగడ్డ పట్టణంలోని మౌళి వీధిలో గల బీరువాళ్ళ భాషా స్వగృహంలో జాయింట్ యాక్షన్ కమిటీ మరియు ఆవాస్ కమిటీ సంయుక్తంగా మైనార్టీ హక్కులపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం మైనార్టీలకు కల్పించిన హక్కులపై ప్రతి మైనార్టీ సోదరులు కనీస అవగాహన కలిగి ఉండాలని మీడియా ముఖంగా కోరారు. కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ మరియు ఆవాస్ కమిటీ సభ్యులు ఎలక్ట్రిషన్ బాజన్, బర్సాత్ బాబా, గౌస్ పియర్, షేర్ షాషావలి, మెకానిక్ నూర్ భాషా, అబ్దుల్ ఖాదర్, ఇస్మాయిల్ బేగ్, పసివుల్లా ఖాద్రి, మసివుల్లా, అక్రమ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## లగచర్ల ఘటనలో అరెస్ట్ అయిన మాజీ ఏమ్మేల్యే పట్నం నరేందర్ రెడ్డికి బెయిల్



**వికారాబాద్,డిసెంబర్18( ప్రజాక్షేత్రం):**

లగచర్ల ఘటనలో అధికారులపై దాడి విషయంలో అరెస్ట్ అయిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి బెయిల్ మంజూరు అయింది. ఆయనతోపాటు ప్రధాన సూత్రధారిగా ఉన్న సురేష్ కు మొత్తంగా 24 మందికి బెయిల్ మంజూరైంది. రాష్ట్ర వ్యాప్తంగా లగచర్ల ఘటన సంచలనంగా మారిన విషయం తెలిసిందే.లగచేర్ల నిందితులు అందరికీ బెయిల్ మంజూరు చేసిన నాంపల్లి స్పెషల్ కోర్టు.పట్నం నరేందర్ రెడ్డి తో పాటు సురేష్, మిగతా నిందితులు అందరికీ బెయిల్ మంజూరు పట్నం నరేందర్ రెడ్డి కు 50 వేల రెండు షురూటీలు , మిగతా వారు 20 వేల షూరిటిలు సమర్పించాలని ఆదేశం మూడు నెలల పాటు ప్రతి బుధవారం పోలీసుల ముందు విచారణ హాజరుకావాలని పట్నం నరేందర్ రెడ్డికి ఆదేశం.

## నిరుపేదలకు దుప్పట్లు, చీరలను అందించిన ఎస్సై

**చండూరు,డిసెంబర్ 18(ప్రజాక్షేత్రం) :**

ప్రతినెల 1వ తేదీన గాంధీజీ ఫౌండేషన్ 22 మంది నిరుపేదలకు నిత్యావసర సరుకులను అందిస్తూ వస్తుంది. ఆ కార్యక్రమంలో భాగంగా చండూర్ ఎస్సై వెంకన్న గౌడ్ నిరుపేదలను, వారి స్థితిగతులను చూసి చెలించిపోయాడు. గత 15 రోజులుగా విపరీతమైన చలి ఉన్నది గమనించి అట్ట నిరుపేదలకు ఇవ్వమని దుప్పట్లను, చీరలను గాంధీజీ ఫౌండేషన్‌కు పంపించారు. బుధవారం నాడు స్థానిక గాంధీజీ విద్యాసంస్థలలో గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు వారికి దుప్పట్లను, చీరలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దయార్థ హృదయంతో ఎస్సై వెంకన్న గౌడ్ పేదలకు దుప్పట్లు, చీరలు పంపడం ఆయన సేవా గుణానికి నిదర్శనమని అన్నారు. దుప్పట్లు, చీరలను అందుకున్న నిరుపేదలు ఎస్సై కుటుంబం కలకాలం సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని భగవంతుని కోరుకున్నారు.






## పీజేపీ క్యాంపులోనే జిల్లా కోర్టు సముదాయన్ని ఏర్పాటు చేయాలి

- సంపూర్ణ మద్దతు తెలిపిన జోగులాంబ గద్వాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ
- బీఆర్ఎస్ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య
- జోగులాంబ గద్వాల జిల్లా బార్ అసోసియేషన్ వారు చేపట్టిన నిరసన దీక్షకు సంపూర్ణ మద్దతు తెలిపిన బీఆర్ఎస్ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య




**గద్వాల్,డిసెంబర్18(ప్రజాక్షేత్రం):**

గద్వాల్ జిల్లా కేంద్రంలో గద్వాల్ బార్ అసోసియేషన్ వారు నిర్వహించిన నిరసన దీక్ష కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు కురువ పల్లయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కోర్టుకు పూడురు శివారు స్థలాన్ని కేటాయిస్తు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గద్వాల ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేదని అని అన్నారు. తమ ప్రభుత్వ హాయంలోనే స్థల సేకరణ, నిధుల కేటాయింపు జరిగిందన్నారు. ఈ రోజు మెజారిటీ న్యాయవాదులు ఆ స్థలం వద్దని తీర్మానం చేసి విధులు బహిష్కరణ చేపట్టిన నేపథ్యంలో పార్టీలో ఈ విషయమై చర్చించడం జరిగిందన్నారు. తాము కూడా ప్రజలు, కక్షిదారుల కోణంలో ఆలోచించి న్యాయవాదులు చేస్తున్న ఆందోళన న్యాయ బద్ధమైనది అని అన్నారు.జిల్లా ప్రజలకు ఆమోదమైనా స్థలంలోనే కోర్టును నిర్మించాలి అని అన్నారు. న్యాయవాదుల డిమాండ్ న్యాయబద్ధమైనది తక్షణమే ఈ జిల్లా కలెక్టర్ గారు గాని ఇక్కడ ఉన్న ప్రజాప్రతినిధులు గాని అనంతపురం గుట్టలో కాకుండా బిజెపి క్యాంపులో కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నాం అని తెలిపారు.

## గ్రూప్ 4 ఉద్యోగం సాధించిన యువకుడికి ఘన సన్మానం

**వనపర్తి డిసెంబర్ 19(ప్రజాక్షేత్రం):**



వనపర్తి పట్టణానికి చెందిన నరేష్ కుమార్ యాదవ్ అనే యువకుడు గ్రూప్ 4 ఫలితాలలో జిల్లా మొదటి ర్యాంకు సాధించి జూనియర్ అకౌంటెంట్ పోస్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం నాడు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తన నివాసంలో ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ ఇమ్రాన్ నాయకులు చిట్యాల రాము, శ్రీకర్ (చింటు) ముని కుమార్ హాలీం తదితరులు పాల్గొన్నారు.

## దేశ ప్రజలకు హెూం మంత్రి అమిత్ షా క్షమాపణలు చెప్పాలి

- దేశంలోని బహుజన కులాల ప్రజలకు అంబేద్కర్ దేవుడే!
- రాజ్యాంగ బిక్షతో హెూమ్ మంత్రి అయినా విషయం అమిత్ షా కు తెలియదా?
- పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్‌ని అవమానించిన అమిత్ షా! రాజ్యాంగానికి బీజేపీ వ్యతిరేకం!
- బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు జీ. మణి కుమార్



**గద్వాల,డిసెంబర్18(ప్రజా క్షేత్రం):**

పార్లమెంటు సాక్షిగా దేశ రాజ్యాంగ రక్షకుడు ప్రపంచ మేధావి అంబేద్కర్ గని అవమానించిన కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు గద్దెపాగ మణి కుమార్ డిమాండ్ చేశారు.బుధవారం ఆయన జిల్లా కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగానికి బీజేపీ వ్యతిరేకమని మరో సారి నిరూపితమయిందన్నారు.అంబేద్కర్ రాజ్యాంగ భిక్షతోనే కేంద్ర మంత్రి పదవి అనుభవిస్తున్న విషయం అమిత్ షా కు తెలియధా అంటూ ఫైర్ అయ్యారుదేశ ప్రజలకి అసలైన దేవుడు మానవ హక్కులను కల్పించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని అన్నారు.అలాంటి ప్రపంచ మేధావిని అవమానించడం బీజేపీ కుల,సంకుచిత రాజకీయాలకు నిదర్శనమన్నారు.అంబేద్కర్ రాసిన రాజ్యాంగం లేకుంటే బీజేపీ ఈ రోజు దేశాన్ని పరిపాలించేదా అని ప్రశ్నించారు.తక్షణమే దేశ ప్రజలకు బీజేపీ హెూం మంత్రి అమిత్ షా బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి వెంకటేష్ నాయక్, మల్దకల్ మండల అధ్యక్షులు ఉల్లిగడ్డల గోవిందు, ప్రధాన కార్యదర్శి రామ్ పోగు నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కిసాన్ మేళాను ప్రారంభించిన మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి

- ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన వంగడాలు, పంట సాగులో కొత్త మెళకువలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వంటివి రైతులు అందిపుచ్చుకోవాలి
- భవిష్యత్తులో వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం పెరుగుతుందన్న మంత్రి
- ఆకట్టుకున్న వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనలు









నంద్యాల,డిసెంబర్ 18,(ప్రజాక్షేత్రం)

అగ్రికల్చర్ మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులు, అధిక దిగుబడి ఇచ్చే నూతన వంగడాలు, పంట సాగులో నూతన విధానాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వంటివి అందిపుచ్చుకొని రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిలు పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ లోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం మైదానంలో ఆచార్య ఎన్ జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నేడు నంద్యాల జిల్లా కలెక్టరేట్ లో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా మైదానంలో నిర్వహించిన "కిసాన్ మేళా" కార్యక్రమాన్ని మంత్రులు, జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా తదితరులు జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ ఏడిఆర్ఆర్ డా. ఎం జాన్సన్, ఆచార్య ఎన్ జి రంగా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ శారదా జయలక్ష్మి దేవి, బోర్డు మాజీ సభ్యులు భగీరథ చౌదరి, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పద్ధతులను అవలంబించి అధిక దిగులు సాధించాలని ఆకాంక్షించారు. తూర్పు ప్రాంతంలో ఎన్నో కాలువలు ఉన్నాయని మన ప్రాంతంలో కేసీ కెనాల్ మాత్రమే ఉండేది అన్నారు. అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు ఎస్ఆర్బిసి, తెలుగు గంగ, బానకకచర్ల తదితర సాగునీటి ప్రాజెక్టులకు పునాది వేసి రాయలసీమ ప్రాంతానికి నీళ్లు అందించి సస్యశ్యామలం చేశారన్నారు. జిల్లాలో రైతుల కోసం ఏర్పాటుచేసిన ఆగ్రో, షుగర్ ఫ్యాక్టరీలు అంతరించి ఉపాధి లేకుండా చేశాయన్నారు. గతంలో ఐదు లక్షల ఎకరాలు పత్తి పండించే రైతులు నేడు లక్ష ఎకరాలకు పరిమితమై ఉన్నారని ఇందుకు గల కారణాలను అన్వేషించాలని మంత్రి పేర్కొన్నారు. అలగనూరు ప్రాజెక్ట్ పూర్తి అయితే 40 టీఎంసీ లనీరు నిల్వ ఉంటుందని, అలాగే పోలవరం పూర్తయితే శ్రీశైలం వాటర్ ను పుష్కళంగా మనమే వాడుకోవచ్చని మంత్రి తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం బాధాకరమని, రైతుల పంటలకు గిట్టుబాటు కల్పించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయం గురించి పూర్తి అవగాహన ఉన్న, నిత్యం పొల్లాల్లో ఉండే రైతన్నలకు తాము కొత్తగా వ్యవసాయంలో మెళుకువలు చెప్పే పరిస్థితి ఉత్పన్నం కాదన్నారు. తాము కూడా రైతు కుటుంబం నుంచే వచ్చామని, చిన్నతనంలో మా తల్లిదండ్రులుకు వ్యవసాయ పనుల్లో సాయపడేవాళ్లమన్నారు.. అయితే నేడు కాలం మారిందని అందుకనుగుణంగా.. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, అధిక దిగుబడి ఇచ్చే నూతన వంగడాలు, పంటల సాగులో సరికొత్త విధానాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వంటివి చూసి రైతులు కూడా నూతన వ్యవసాయ విధానాలకు అలవాటు పడాలన్నారు. శాస్త్రవేత్తలు ఎంతో కష్టపడి తక్కువ శ్రమతో ఎక్కువ దిగుబడి సాధించే.. శనగ, కొర్రలు, ప్రొద్దు తిరుగుడు, మొక్క జొన్న వంటి నూతన వంగడాలను ఆవిష్కరిస్తున్నారని వాటిని అందిపుచ్చుకోవడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు. సాంకేతికతను, నూతన వంగడాలను ఉపయోగించి, వ్యవసాయంలో మెరుగైన పలితాలు సాధించవచ్చన్నారు. ఇప్పటికైనా రైతులు తమ ఆలోచన విధానం మార్చుకోవడం ద్వారా అతి తక్కువ ఖర్చుతో అధిక పంట దిగుబడులు సాధించే విధంగా ఆధునిక వ్యవసాయ విధానాలను అవలంభించాలని మంత్రి పిలుపునిచ్చారు. భూపరీక్షలు (సాయిల్ టెస్టింగ్) చేసినప్పుడు, పంట మార్పిడి అవసరమని, తరచుగా ఒకే పంటను వేయడం, ఎరువులు వినియోగం ఎక్కువ కావడం వల్ల భూసారం తగ్గిపోతుందన్నారు. నేడు మార్కెట్ లో ఒక పంటకు రేటు ఎక్కువ ఉందని తెలిస్తే అందరూ అదే పంటను వేయడం వంటి కారణాలతో ఆ పంట ఉత్పదాకత పెరిగి, దిగుబడి వచ్చే నాటికి ఆ పంటకు మార్కెట్ లో డిమాండ్ తగ్గడంతో రైతుకు గిట్టుబాటు ధర అందని పరిస్థితి నెలకొంటుందన్నారు. కాబట్టి పంటలను సమతుల్యం చేసుకోవాల్సిన బాధ్యత కూడా రైతులపై ఉంటుందన్నారు. నేడు వ్యవసాయానికి కూలీల కొరత కూడా తీవ్రంగా వేధిస్తొందని, కూలీ ఖర్చులను తగ్గించుకోవడానికి, నేడు యాంత్రీకరణను పెంచుకోవడం ఒక్కటే మార్గమన్నారు. ప్రభుత్వం కూడా సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లను కూడా అందిస్తోందని వాటిని వినియోగించుకోవాలన్నారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన డ్రోన్ సదస్సు ద్వారా. వ్యవసాయ రంగంలో రానున్న రోజుల్లో డ్రోన్ ల వినియోగం మరింత పెరగనుందన్నారు. డ్రోన్ ల ద్వారా స్ప్రే చేయడం వంటివి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఓర్వకల్లులో డ్రోన్ హబ్ ను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. వ్యవసాయ రంగంలో వచ్చిన వినూత్న పరికరాలను అందిపుచ్చుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా రైతులు మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో కూడా పోలవరం నిర్మాణం పూర్తయితే, రాయలసీమ సస్యశ్యామలం అవుతుందనే ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో నదుల అనుసంధానానికి తెరతీశామన్నారు. ప్రతి ఎకరాకు నీళ్లు ఇవ్వాలనే ఆలోచనతో త్వరలో మరిన్ని ప్రాజెక్టులు పూర్తి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. గతంలో నీరు %-% చెట్టు అనే కార్యక్రమం చేపట్టడం ద్వారానే నేడు రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరగడానికి ప్రధాన కారణమన్నారు. మాది రైతు ప్రభుత్వం.. రైతులకు అండగా ఎప్పుడూ మా ప్రభుత్వం ఉంటుందని భరోసా ఇచ్చారు.. ఈ సందర్భంగా రైతు కార్మికులు, రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, పరిశోధకులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.. అలాగే స్థానికంగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే విషయంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ను మంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రైతు బిడ్డగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో 5.9 లక్షల ఎకరాలు సాగునీటి కాలువల కింద సాగవుతున్నాయని... రైతులు భూసార పరీక్షలు నిర్వహించుకుని అందుకు అనుగుణంగా పంటలు వేసుకొని మంచి దిగుబడులు సాధించాలన్నారు. ఎరువులు మోతాదుకు మించి వినియోగించడం వల్ల భూములు నిర్వీర్యం అయిపోతున్నాయన్నారు. రైతులు అనురాధనా పద్ధతులను అవలంబించి మిశ్రమ పంటలు వేసుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు. పండిస్తున్న చిరుధాన్యాలకు వ్యాల్యూ ఎడిషన్, ప్యాకింగ్ మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. 70 వేల హెక్టార్లలో ఒకే సెనగ పంటకు పరిమితమై మిగిలిన 9 నెలల కాలం వృధాగా ఉంచకుండా ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా రైతులను మోటివేట్ చేయాలన్నారు. ప్రతి కుటుంబం ఉపాధి పరిశ్రమగా మారాలని కలెక్టర్ తెలిపారు. అధునాతన పద్ధతులను అందిపుచ్చుకొని చక్కటి వ్యవసాయం చేసే సత్తా రైతుల్లో ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. అంతకుముందు కిసాన్ మేళాలో భాగంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ ఉత్పత్తులను, ఏర్పాటు చేసిన స్టాళ్లను సైతం మంత్రులు, కలెక్టర్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కిసాన్ మేళాలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. వివిధ గ్రామాల నుంచి రైతులు పండించి తీసు కొచ్చిన వ్యవసాయ ఉత్పత్తులు భళా అనిపిం చాయి. అనంతరం వ్యవసాయంలో నూతన ఆవిష్కరణల కోసం కృషి చేసిన శాస్త్రవేత్తలు, పరిశోధకులకు మంత్రుల చేతుల మీదుగా సన్మానం చేయడం జరిగింది.

# శ్రీతేజ్‌ను చూసేందుకు అల్లు అర్జున్ ఎందుకు రాలేదు

## - అల్లు అరవింద్ వివరణ

- తొక్కిసలాట ఘటన జరిగిన మరుసటి రోజే అల్లు అర్జున్ వద్దామనుకున్నారని వెల్లడి
- డాక్టర్లు వద్దని చెప్పడంతో ఊరుకున్నారన్న అల్లు అరవింద్
- ఆ తర్వాత కేసు నమోదు కావడంతో రాలేకపోయారన్న అరవింద్
- తనను వెళ్లి చూసి రావాలని అల్లు అర్జున్ చెప్పడంతో వచ్చానని వెల్లడి




హైదరాబాద్ డిసెంబర్ 18(ప్రజాక్షేత్రం):

తాను కూడా ప్రభుత్వం అనుమతి తీసుకొని వచ్చానన్న అల్లు అరవింద్ సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను చూడడానికి సినీ నటుడు అల్లు అర్జున్ ఎందుకు రాలేదో ఆయన తండ్రి, నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. ఈరోజు ఆయన కిమ్స్ ఆసుపత్రిలో శ్రీతేజ్‌ను చూసి వచ్చారు. అనంతరం అక్కడ ఉన్న అతని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆ తర్వాత అల్లు అరవింద్ తన కొడుకు ఎందుకు రాలేదో వెల్లడించారు. శ్రీతేజ్‌ను పరామర్శించడానికి అల్లు అర్జున్ ఎందుకు ఆసుపత్రికి వెళ్లలేదని చాలామంది అభిమానులు, బంధువులు, మిత్రులు అడుగుతున్నారని, కానీ దానికి కారణం ఉందన్నారు. సంధ్య థియేటర్‌లో తొక్కిసలాట జరిగిన మరుసటి రోజునే అల్లు అర్జున్ ఆసుపత్రికి రావాలని భావించారని, కానీ ఘటన జరిగిన మరుసటి రోజే రావడం ఎందుకని వైద్యులు చెప్పారని, వారి సూచనలు కరెక్టే అనిపించి అప్పుడు ఆగిపోయినట్లు చెప్పారు. అంతలోనే కేసు నమోదయిందన్నారు. కేసు నమోదు కావడంతో అల్లు అర్జున్ అస్సలు ఆసుపత్రికి వెళ్లవద్దని లీగల్ టీం సూచించిందన్నారు. అలాగే శ్రీతేజ్ కుటుంబ సభ్యులను కలవడానికి కూడా వెళ్లవద్దని చెప్పిందన్నారు. ఆ తర్వాత కూడా తాము రావడానికి అనేక నిబంధనలు అడ్డు వచ్చాయన్నారు.

### ప్రభుత్వ అనుమతితో వచ్చాను

కిమ్స్ ఆసుపత్రికి రావడానికి చివరకు తాను కూడా ప్రభుత్వాన్ని అనుమతి అడిగానని వెల్లడించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడిని కనీసం తాను అయినా వెళ్లి పలకరిస్తానని ప్రభుత్వాన్ని కోరి... అనుమతిస్తే వచ్చానన్నారు. శ్రీతేజ్‌ను నేను చూడలేకపోతున్నానని (నిబంధనల కారణంగా) కనీసం మీరైనా వెళ్లి చూసి రమ్మని తనకు చెప్పారని, దీంతో తాను ప్రభుత్వం అనుమతితో వచ్చానన్నారు.
తనకు అనుమతి ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, పోలీసు శాఖకు, కిమ్స్ ఆసుపత్రి సీఈవో, మెడికల్ డైరెక్టర్, ఆసుపత్రి సిబ్బందికి అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### శ్రీతేజ్ కోలుకోవడానికి సమయం పడుతుందని డాక్టర్లు చెప్పారు

కిమ్స్ ఆసుపత్రి ఐసీయూలో ఉన్న శ్రీతేజ్‌ను చూసి వచ్చానని, అతను రోజురోజుకు రికవరీ అవుతున్నాడన్నారు. శ్రీతేజ్ గురించి తాను డాక్టర్లతో మాట్లాడానన్నారు. 14 రోజులుగా ఆసుపత్రిలో ఉంటున్నాడని, అయితే గత 10 రోజులుగా రికవరీ కనిపిస్తోందన్నారు. అయితే శ్రీతేజ్ పూర్తిగా కోలుకోవడానికి కాస్త సమయం పడుతుందని డాక్టర్లు చెప్పారన్నారు. శ్రీతేజ్ కోలుకోవడానికి తాము ఏం చేయడానికైనా సిద్ధమే అన్నారు. శ్రీతేజ్ ఆరోగ్యంపై ప్రభుత్వం కూడా ప్రత్యేక శ్రద్ధ వహించడం అభినందనీయమన్నారు.

## మాథ్స్ మరియు సైన్సు ఒలింపియాడ్‌లో బ్రిలియంట్ విద్యార్థుల ప్రతిభ



సారపాక, డిసెంబర్ 18(ప్రజాక్షేత్రం):-

రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థినీ విద్యార్థుల లో మాథ్స్ మరియు సైన్స్ కు సంబంధించి ప్రతిభను వెలికి తీసేందుకు "%వా=ఫీ% " ఒలింపియాడ్ వారు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మ్యాథ్స్ సైన్సు ఒలింపియాడ్ పరీక్షలో బ్రిలియంట్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి రెండవ రౌండ్ కు ఎంపికైనట్లు బ్రిలియంట్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ బి ఎన్ ఆర్ తెలియజేసారు. నవంబర్ 12 న నిర్వహించిన మాథ్స్ మరియు సైన్సు ఒలింపియాడ్ మొదటి రౌండ్ పరీక్ష లో తమ విద్యార్థులు పాల్గొని పరీక్ష రాయడం జరిగింది అన్నారు. నిన్న వెలువరించిన ఫలితాల్లో రెండవ రౌండ్ అయినటువంటి మాథ్స్ మరియు సైన్సు పరీక్షకు తమ విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయం అన్నారు. ఈ సంధర్భంగా బ్రిలియంట్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్: బి ఎన్ ఆర్ మరియు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించి భవిష్యత్తులో కూడా మంచి ఫలితాలను సాధించాలని కోరారు.

## ఈ కార్ రేస్‌పై అసెంబ్లీలో చర్చకు రెడీ:కేటీఆర్ సవాల్



హైదరాబాద్,డిసెంబర్18(ప్రజాక్షేత్రం):

ఈ కార్ రేసులో స్కామంటా లీకులిస్తున్నారని అసెంబ్లీలో చర్చించడానికి సిద్ధమని మంత్రికేటీఆర్.. సీఎం రేవంత్ కు సవాల్ చేశారు. ఈ మేరకు ఓ బహిరంగ లేఖను సీఎంకు విడుదల చేశారు. ఫార్ములా ఈ రేస్ స్కాంపై ఏడాదికి తనపై నిరాధారణ ఆరోపణలు చేస్తున్నారని దీనిపై గంట సేపు కేబినెట్‌లో చర్చిస్తారా అని మండిపడ్డారు. కేసులు నమోదు చేస్తామని, గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ ఆమోదం వచ్చిందని రకరకాల లీకులు సీఎం కార్యాలయం నుండి మీడియాకు ఇస్తున్నారని.. అసెంబ్లీలో చర్చ పెడితే నిజానిజాలేంటో ప్రజలకు తెలుస్తాయన్నారు. హైదరాబాద్ నగరానికి మంచి జరగాలనే సదుద్దేశంతో ఫార్ములా-ఈ రేస్ నిర్వాహకులతో ఒప్పందం చేసుకున్నామని.. దీని వల్ల ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ.700 కోట్ల రూపాయల లాభం వచ్చిందన్నారు. రెండో దఫా రేస్ జరగాల్సి ఉన్నా రద్దు చేశారని మండిపడ్డారు. ఒప్పందం అంతా పారదర్శకంగా జరిగిందని ప్రజలకు నిజాలు తెలియాలన్నారు. చెల్లింపులు కూడా పారదర్శకంగానే జరిగాయని.. ఎక్కడా అవకతవకలు జరగలేదన్నారు. ప్రజలకు నిజాలు తెలియాలంటే అసెంబ్లీలో చర్చ జరగాలన్నారు. మీకు అనుకూలమైన రోజే ఈ చర్చను పెట్టాలన్నారు. ఫార్ములా-ఈ అంశంలో ఎలాంటి అవకతవకలు కానీ, అవినీతి కానీ జరగలేదు. రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి చేసే ఈ రేస్ను కేవలం మీ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు బలి చేశారని ఆరోపించారు. ఈ అంశంపై ఏసీబీ కేసు నమోదు చేయబోతున్న తరుణంలో అసెంబ్లీలో చర్చకు కేటీఆర్ సవాల్ చేయడంతో రేవంత్ రెడ్డి ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

## కేటీఆర్,కౌశిక్ రెడ్డికి తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ స్ట్రాంగ్ వార్నింగ్



హైదరాబాద్, డిసెంబర్ 18(ప్రజాక్షేత్రం):

అసెంబ్లీలో సహజంగా శాంత స్వభావంతో స్పీకర్ విధులు నిర్వహించే గడ్డం ప్రసాద్ బుధవారం నేటి సమావేశాల సందర్భంగా ఆగ్రహావేశాలను లోన య్యారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానాన్ని ప్రతి పాదంచిన సందర్భంగా ఆటో డ్రైవర్ల సమస్యలపై సభలో అధికార, ప్రతి పక్షాల మధ్య చర్చ పరస్పర విమర్శలతో సభ వేడెక్కింది. ఈ సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపి.వివేకా నంద, పాడి కౌశిక్ రెడ్డి, కేటీఆర్ లు ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యల చేశారు. వివేకానంద వ్యాఖ్యల పట్ల శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర అభ్యం తరం వ్యక్తం చేయ గా, వాటిని రికార్డుల నుంచి తొలగిస్తానని స్పీకర్ ప్రసాద్ ప్రకటించా రు. ముఖ్యంగా టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని స్పీకర్ హెచ్చరించారు. సభ నిబంధన ప్రకారం నడుచు కోవాలని సూచించా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, కేటీఆర్ కు స్పీకర్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. వెళ్లి ఎవరి స్థానంలో వాళ్లు కూర్చో వాలని కూర్చోక పోతే సభ నుండి సస్పెండ్ చేస్తానని, ఇద్దరిని గట్టిగానే అరుసుకున్నడు.

### ఓయు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌కు శుభాకాంక్షలు తెలిపినా ఎం ఎస్ ఎఫ్ నాయకులు




హైదరాబాద్ డిసెంబర్ 19(ప్రజాక్షేత్రం):

తెలంగాణ రాష్ట్ర ఈసెట్ కన్వీనర్‌గా నియమితులైన ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ ని కలసి పూల బొకేతొ సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన ఎం ఎస్ ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ, టి ఎస్ పి జెఎసి ఫౌండర్ వలిగొండ నరసింహ, రామరపు శ్రీనివాస్ మాదిగ, మంద రాజు మాదిగ, జనపాల మహేష్ మాదిగ, అజయ్ సామ్రాట్, వంశీ, అభినవ్ మాదిగ, శ్యామ్ మాదిగ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌ను అవమానించని పార్టీ నుంచి వచ్చా..

# నా పూర్తి ప్రసంగాన్ని చూడండి!: అమిత్ షా

- కలలో కూడా అంబేద్కర్ ఆలోచనలను అవమానించలేని పార్టీ నుంచి వచ్చానన్న అమిత్ షా
- కాంగ్రెస్ పార్టీయే అంబేద్కర్‌కు వ్యతిరేకమన్న అమిత్ షా
- రాజ్యసభ రికార్డుల్లో నా ప్రసంగం ఉందన్న అమిత్ షా



**న్యూఢిల్లీ డిసెంబర్ 18 (ప్రజాక్షేత్రం):**

కలలో కూడా అంబేద్కర్ ఆలోచనలను అవమానించలేని పార్టీ, సిద్ధాంతం నుంచి తాను వచ్చానని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. రాజ్యసభలో తాను చేసిన పూర్తి ప్రసంగాన్ని మీడియా కూడా ప్రజలకు చూపించాలన్నారు.నిన్న రాజ్యసభలో ఆయన చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ప్రతిపక్షాలు పదేపదే అంబేద్కర్... అంబేద్కర్... అంబేద్కర్ అంటున్నాయంటూ కాంగ్రెస్ సహా విపక్షాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో అమిత్ షా.. అంబేద్కర్‌ను అవమానించారంటూ ఇండియా కూటమి నేతలు ఆరోపించారు. ఈ అంశంపై ఆయన ఈరోజు స్పందించారు.కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌కు వ్యతిరేకమన్నారు. రాజ్యసభలో తాను నిన్న చేసిన వ్యాఖ్యలను వక్రీకరించిందన్నారు. కాంగ్రెస్ దేశంలో అవాస్తవాలను వ్యాపింప చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో తాను చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ వక్రీకరించిందని, దీనిని తాను ఖండిస్తున్నానన్నారు. కాంగ్రెస్ పార్టీయే అంబేద్కర్ వ్యతిరేకి.. రిజర్వేషన్ వ్యతిరేకి... రాజ్యాంగ వ్యతిరేక పార్టీ అని ధ్వజమెత్తారు.కాంగ్రెస్ ఎప్పుడూ అంబేద్కర్ స్మారకాన్ని నిర్మించలేదన్నారు. కానీ బీజేపీ మాత్రం ఆయనకు ఎప్పుడూ గౌరవాన్ని ఇచ్చిందని వ్యాఖ్యానించారు. తన ప్రసంగం రాజ్యసభ రికార్డుల్లో చాలా స్పష్టంగా ఉందని వెల్లడించారు. తాను రాజీనామా చేయాలని ఖర్గే డిమాండ్ చేస్తున్నారని, అలా చేయడానికి తాను సిద్ధమే అన్నారు. కానీ మరో పదిహేనేళ్ళ వారు ప్రతిపక్షంలోనే ఉండాలని, తన రాజీనామా వల్ల వారికి వచ్చేదేమీ లేదన్నారు.




**హైదరాబాద్ డిసెంబర్ 18 (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిపై క్లారిటీ వచ్చిందా..? కొత్త అధ్యక్షుడు ఎవరు..? సంస్థాగతంగా ఎన్నికలు అన్నారు, ఎన్నిక ద్వారానే అధ్యక్ష ఎన్నిక ఉంటుందన్నారు. కానీ అప్పుడే ప్రెసిడెంట్ ఎంపిక జరిగిపోయిందా? ఢిల్లీ హై కమాండ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిని సెలెక్ట్ చేశేసిందా? పేరుకు మాత్రమే సంస్థగత ఎన్నికలంటూ కమలం పార్టీ హడావుడి మొదలుపెట్టిందా..? ఇంతకీ బీజేపీ అధిష్టానం ఎవరివైపు మొగ్గు చూపుతుంది? తెలంగాణ రాష్ట్ర బీజేపీకి కొత్త అధ్యక్షుడు ఎవరన్న దానిపై పార్టీ వర్గాల్లో నెలకొన్న ఉత్కంఠకు త్వరలోనే తెరపడనుంది. పార్టీ జాతీయ నాయకత్వం.. సంక్రాంతి కల్లా రాష్ట్రానికి అధ్యక్షుడిని నియమించనున్నట్లు తెలుస్తోంది. అయితే అంతర్గత చర్చల్లో రోజుకో సీనియర్ నేత పేరు తెరపైకి వస్తున్నా.. ఎంపీగా ఉన్న బీసీ నేతకు ఎక్కువ అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒకవేళ సమీకరణాలు మారితే మాత్రం అనూహ్యంగా కొత్త నేతకూ అవకాశం దక్కవచ్చని పార్టీ వర్గాలు అంటున్నాయి. తెలంగాణలో ఈసారి ఎలాగైనా అధికారంలోకి రావాలన్న పట్టుదలతో ఉన్న బీజేపీ జాతీయ నాయకత్వం మదిలో ఏముందో రాష్ట్రంలోని కీలక నేతలకు సైతం అంతు చిక్కడంలేదు. అధికార పీఠమే అంతిమ లక్ష్యమని, ఇందుకోసం అనుసరించే వ్యూహంలో వేసే ఎత్తుగడలు మాత్రం అనూహ్యంగా ఉండబోతున్నాయని బీజేపీ ముఖ్యనేత ఒకరు తెలిపారు. పార్టీలో కొంతమంది సీనియర్ నేతల మధ్య అంతర్గత విభేదాలున్నాయి. పాత, కొత్త నేతల పంచాయతీలతో రాష్ట్ర పార్టీ వ్యవహారాలు నాలుగు స్తంభాలాటగా మారాయన్న విషయం అధినాయకత్వం దృష్టికి కూడా వెళ్లిందంట. తాము అధికారంలోకి రావాలంటే ముందు పార్టీలో సమన్వయం అవసరమని భావిస్తున్న పార్టీ పెద్దలు.. ఆ దిశగా కొత్త అధ్యక్షుడికి బాధ్యతలు కట్టబెట్టాలని భావిస్తున్నారంట.అన్ని సవాళ్లను ఎదుర్కొని పార్టీని అధికారంలోకి తీసుకురాగలిగే నేతకే ఢిల్లీ పెద్దలు పట్టం కట్టబోతోతున్నారంట.. పోరాట పటిమ, సమన్వయం చేసుకునే సమర్థతతోపాటు వయసును కూడా ప్రామాణికంగా తీసుకునే అవకాశం ఎక్కువగా ఉందంటున్నారు. ఇందుకోసం ఇప్పటికే ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటు పలువురు సీనియర్ నేతల నుంచి అభిప్రాయాలు తీసుకున్న పార్టీ అధిష్ఠానం.. తాజాగా మరోసారి కొంతమంది ముఖ్యుల నుంచి అభిప్రాయాలు తీసుకుందని పార్టీవర్గాలు వెల్లడించాయి.మరోవైపు సంస్థాగత ఎన్నికలకు సంబంధించి బీజేపీ ఇప్పటికే కసరత్తు ముమ్మరం చేసింది. గత నెల 25 నుంచి ఈ ప్రక్రియను మొదలు పెట్టింది. కాగా ఈనెల 15 లోపు బూత్ కమిటీ ఎన్నికలు పూర్తి చేయాలని చూస్తోంది. అందుకు పార్టీ హైకమాండ్ ఇప్పటికే దిశానిర్దేశం చేసింది. 15 నుంచి 20 వరకు మండల కమిటీలు కంప్లీట్ చేయాలని చూస్తోంది. ఈ ప్రక్రియ అనం తరం రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు వెళ్లేందుకు నాయకత్వం సిద్ధం అవు తోంది. ఇప్పటికే పార్టీ బూత్ ల వారీగా ఎన్నికల నిర్వహణకు సంబం ధించి వరుసగా వర్క్‌షాప్‌లు నిర్వహించింది. గ్రౌండ్ నుంచి పార్టీని స్ట్రాంగ్ చేయదాంతో పాటు,. సంస్థాగత ఎన్నికల నిర్వహణ, సభ్య త్వాలు, యాక్టివ్ మెంబర్ షిప్ అంశాలపైనా పార్టీ శ్రేణులకు దిశాని ర్దేశం చేసింది. ఇక సంస్థాగత ఎన్నికల్లో భాగంగా ఇప్పటికే జాతీయ, రాష్ట్ర సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారులను, జిల్లాల వారీగా ఇంచార్జీలను హైకమాండ్ నియమించింది. జాతీయ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా తెలంగాణకు చెందిన రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ ను, రాష్ట్ర సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణను నియమించింది. వారు ఇప్పటికే సంస్థాగతంగా ఎన్నికలకు కసరత్తు ముమ్మరంగా కొనసాగిస్తున్నారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడితో పాటు జాతీయ అధ్యక్షుడు ఎవరవుతారనే ఉత్కంఠ కాషాయ శ్రేణుల్లో నెలకొంది. స్టేట్ ప్రెసిడెంట్ కోసం చాలా మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు రేసులో ఉన్నారు. ఎంపీల్లో రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్, డీకే అరుణ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అలాగే ఎమ్మెల్యేల్లో రాజాసింగ్, పాయల్ శంకర్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఇప్పటికే కొంతమంది నేతలు పార్టీ హైకమాండ్ ఆశీస్సులు పొందాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్టుగా తెలుస్తోంది. అయితే పార్టీ అధ్యక్షుడు ఎవరనే దానిపై అధిష్టానం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. దీంతో హైకమాండ్ నిర్ణయానికి అనుగుణంగానే సంస్థాగత ఎన్నికలు జరిగుతున్నాయనే చర్చ ఆ పార్టీలో జరుగుతోంది. పార్టీ డిసైడ్ చేసిన నేతకే మద్దతు తెలిపి లాంఛనంగా ఎన్నుకుంటారనే టాక్ సైతం వినిపిస్తోంది. అధ్యక్షుడు ఎవరనే నిర్ణయం జరిగిపోవడంతో.. ఇక ఆ పేరు చుట్టూనే ఎన్నిక హడావుడి కొనసాగనుంది. అభ్యర్థి ఈటల రాజేందరే అంటున్నారు. అయితే పార్టీ డిసైడ్ చేసింది ఎవరిని అనేది కాషాయశ్రేణుల్లో సస్పెన్స్‌గా మారిందంట.

## అసెంబ్లీల గడువును లోక్ సభతో ముడిపెట్టడం సరికాదు: షర్మిల

- జమిలి బిల్లును కాంగ్రెస్ సమర్థించదన్న షర్మిల
- బీజేపీ రాజ్యాంగాన్ని అమల్లోకి తీసుకురావాలనుకుంటున్నారని విమర్శ
- లోక్ సభలో ఓటింగ్ వ్యవహారం బీజేపీకి బెడిసికొట్టిందని వ్యాఖ్య



**అమరావతి డిసెంబర్ 18 (ప్రజాక్షేత్రం):**

జమిలి ఎన్నికల బిల్లులను పార్లమెంటులో ప్రవేశ పెట్టడంపై ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల విమర్శలు గుప్పించారు. భారత రాజ్యాంగంపై బీజేపీ దాడి కొనసాగుతూనే ఉందని మండిపడ్డారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి తూట్లు పొడిచి... బీజేపీ రాజ్యాంగాన్ని అమల్లోకి తీసుకురావాలను కుంటున్నారని దుయ్యబట్టారు. పార్లమెంటులో పూర్తి మెజార్టీ లేకపోయినా రాజ్యాంగ వ్యతిరేకంగా బిల్లులను ప్రవేశపెట్టడం... బీజేపీ నిరంకుశ విధానానికి నిదర్శనమని షర్మిల అన్నారు. అసెంబ్లీల గడువును లోక్ సభతో ముడిపెట్టడం సమంజసం కాదని చెప్పారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న జమిలి బిల్లును కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోందని షర్మిల అన్నారు. రాజ్యాంగ సవరణకు కావాల్సిన మూడింట రెండొంతుల మెజార్టీ బీజేపీకి లేదనే విషయం లోక్ సభలో ఓటింగ్ తో తేలిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కూలిపోతే... రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఎందుకు కూలిపోవాలని... ఇందులో ఏమైనా అర్థం ఉందా? అని ప్రశ్నించారు. లోక్ సభలో ఓటింగ్ వ్యవహారం బీజేపీకే బెడిసికొట్టిందని చెప్పారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచే జమిలి బిల్లును కాంగ్రెస్ సమర్థించదని స్పష్టం చేశారు.

## జమిలి ఎన్నికలపై జేపీసీ.. కమిటీలో ప్రియాంకగాంధీకి చోటు

- 31 మంది సభ్యులతో జేపీసీ వేసిన కేంద్రం
- 21 మంది లోక్‌సభ సభ్యులు, 10 మంది రాజ్యసభ సభ్యులు
- కమిటీలో సీఎం రమేశ్, బాలశౌరి, అనురాగ్ ఠాకూర్



**న్యూఢిల్లీ డిసెంబర్ 18(ప్రజాక్షేత్రం):**

జమిలి ఎన్నికలపై కేంద్ర ప్రభుత్వం సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటు చేసింది. వివిధ పార్టీలకు చెందిన 31 మందితో జేపీసీని ఏర్పాటు చేసింది. ఇందులో 21 మంది లోక్ సభ సభ్యులు, 10 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు. జేపీసీలో తెలుగు రాష్ట్రాల నుంచి సీఎం రమేశ్, వల్లభనేని బాలశౌరి ఉన్నారు. ఇటీవలే వయనాడ్ లోక్ సభ నుంచి గెలిచిన కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ కూడా ఉన్నారు. లోక్ సభ, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు జమిలి కోసం సభలో బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లుల పరిశీలన కోసం కేంద్రం జేపీసీని వేసింది.జేపీసీలో లోక్ సభ నుంచి ఉన్న 21 మంది సభ్యుల్లో... పీపీ చౌదరి, సీఎం రమేశ్, బన్సూరి స్వరాజ్, పురుషోత్తంభాయ్ రూపాలా, అనురాగ్ సింగ్ ఠాకూర్, విష్ణుదయాల్ రామ్, భర్తృహరి మహ్తాబ్, సంబిత్ పాత్రా, అనిల్ బలూని, విష్ణు దత్త శర్మ, ప్రియాంక గాంధీ వాద్రా, మనీష్ తివారి, సుఖ్‌దేవ్ భగత్, ధర్మేంద్ర యాదవ్, కల్యాణ్ బెనర్జీ, టీఎం సెల్వ గణపతి, జీఎం హరీశ్ బాలయోగి, సుప్రియా సూలే, శ్రీకాంత్ ఏక్‌నాథ్ షిండే, చందన్ చౌహాన్, బాలశౌరి వల్లభనేని ఉన్నారు. రాజ్యసభ నుంచి పది మంది సభ్యుల పేర్లను ప్రతిపాదించారు.

## సర్వేల్ గురుకులంలో దారుణం..

- విద్యార్థికి తీవ్ర గాయం



**సంస్థాన్ నారాయణపురం డిసెంబర్ 18(ప్రజాక్షేత్రం):**

రాష్ట్రంలో పేరొందిన గురుకుల విద్యాలయాలలో సర్వేలు గురుకులం ఒకటి. అలాంటి పాఠశాలలో ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతో ఓ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్ లోని బాలుర గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతికి చదువుతున్న..శివరాత్రి శామ్యూల్ అనే విద్యార్థి అల్పాహార సమయంలో విద్యార్థులందరికీ రాగిజావ పోసేందుకు గిన్నెను పైకి ఎత్తాడు. దీంతో ఒక్కసారిగా గిన్నె శామ్యూల్ కాళ్ళ మీద పడి తీవ్ర గాయాలయ్యాయి. శామ్యూల్ ను హైదరాబాదులోని ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ సంఘటనలో శామ్యూల్ తో పాటు మరో ఇద్దరు కూడా గాయపడినట్లు తెలుస్తుంది. జి మదన్ అనే వ్యక్తి కూడా గాయపడడంతో.. ఆయనకు పాఠశాలలోనే ఆయింట్మెంట్ రాసి చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. విద్యార్థులకు వడ్డించాల్సిన వంట మాస్టర్లు ఉండగా.. ఎనిమిదో తరగతి విద్యార్థులతోనే నిత్యం వడ్డించడంతోనే ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు విద్యార్థులు తెలిపారు. అంతేకాకుండా గురుకుల పాఠశాలలోని డిప్యూటీ వార్డెన్ తొందరపాటు కూడా ఇందుకు కారణంగా తెలుస్తుంది. బుధవారం అసలు మెనూలో లేని రాగి జావాను విద్యార్థులకు వడ్డించడం చూస్తే ..అసలు ప్రతిరోజు మెనూ పాటించడం లేదని అనుమానం కలుగుతుంది. జరిగిన ప్రమాదంపై గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశంను వివరణ కోరగా.. విద్యార్థులు ఎవరు వడ్డించడం లేదని వంట చేసే వాళ్ళు వడ్డించే సమయంలో గిన్నె జారడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు.

## రాజన్న జిల్లా వేములవాడలో వ్యక్తి దారుణ హత్య?



**వేములవాడ డిసెంబర్ 18 (ప్రజాక్షేత్రం):**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో ఈరోజు ఉదయం దారుణ హత్య జరిగింది. నూకలమర్రి గ్రామానికి చెందిన రషీద్ (35) అనే వ్యక్తిని గుర్తు తెలియని దుండగులు కోనయ్యపల్లి రహదారిలో హోండా యాక్టివా షోరూం పక్కనే కత్తులతో విచక్షణా రహి తంగా నరికి చంపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రషీద్ తలతో పాటు మొత్తం 20 చోట్ల దాడి గాట్లు ఉన్నా యని సమాచారం. హత్య చాలా పాశవికంగా జరిగిం దని పోలీసులు తెలిపారు. మృతుడి మృతదేహాన్ని వేము లవాడ ఏరియా ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం నిమిత్తం సిద్ధం చేశారు. మృతునికి భార్య సిరిన్, ఒక కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. దారుణ హత్య నేపథ్యంలో కుటుం బం కన్నీటి పర్యంతమవు తూ...తీవ్ర విషాదంలో మునిగిపోయింది. రషీద్ గంగాధరలో డాక్యుమెంట్ రైటర్‌గా పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఈ హత్యకు పాల్పడినట్టు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించేందుకు కసరత్తు చేస్తున్నారు. హత్యకు గల కారణాలపై దర్యాప్తు ముమ్మరం చేసి నిందితులను త్వరగా గుర్తించి పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ దారుణ హత్య వేముల వాడ పట్టణంలో తీవ్ర కలకలాన్ని రేపింది. దారుణ హత్యతో స్థానికులు భయాందోళనకు గురవు తున్నారు.

## మండుటెండలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు



**ఆదిలాబాద్ డిసెంబర్ 18 (ప్రజాక్షేత్రం):**

ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోనిజిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 250 మందికిపైగా విద్యార్థులు, ప్రతిరోజూ మధ్యాహ్నభోజనం మండుటెండలో కూర్చొని తింటు న్నారు. గత ప్రభుత్వ హయంలో మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా డైనింగ్ హాల్ మంజూరై, గోడలు కూడా కట్టారు. ఇంతలోనే కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో తినడానికి కనీసం నీడ కూడా లేక పోవడంతో విద్యార్థులు మండుటెండల్లోనే మధ్యాహ్నభోజనం చేస్తున్నారు.

## జావ ఎంతసేపు తాగుతారంటూ ప్రిన్సిపల్ ఆగ్రహం

- ఇద్దరు విద్యార్థినులను పైపుతో కొట్టడంతో గాయాలు
- యాదాద్రి జిల్లా లోతుకుంట ఆదర్శ పాఠశాలలో ఘటన



**వలిగొండ డిసెంబర్ 18(ప్రజాక్షేత్రం):**

ఇద్దరు బాలికలను ప్రిన్సిపల్ విచక్షణారహితంగా కొట్టిన ఘటన యాదాద్రి-భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని లోతుకుంట ఆదర్శ పాఠశాలలో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అక్షిత, అఖిల లోతుకుంట ఆదర్శ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నారు. ఈ నెల 12న ఉదయం వారు జావ తాగుతుండగా ఎంత సేపుతాగుతారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రిన్సిపల్ రహిసున్నిసా బేగం విద్యార్థినులను పైపుతో కొట్టారు. దీంతో భయపడిన బాలికలు గాయాల గురించి తల్లిదండ్రులకు చెప్పకుండా మరుసటి రోజు యథా విధిగా పాఠశాలకు వచ్చారు. వారిని పిలిచి ఎలా ఉందని అడిగిన ప్రిన్సిపల్ ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఇద్దరికీ ఫ్రాక్చర్ అయినట్లు గుర్తించి బ్యాండేజ్ వేయించారు. తర్వాత రెండ్రోజులు సెలవులు కావడంతో విషయం బయటకు రాలేదు. సోమవారం తల్లిదండ్రులు ప్రిన్సిపల్ వద్దకెళ్లి నిలదీశారు. 'క్షమించండి, మరోసారి ఇలాంటి పొరపాటు చేయను వదిలేయండి.. ఆసుపత్రి ఖర్చులు భరిస్తా'అని ప్రిన్సిపల్ సమాధానం చెప్పినట్లు తల్లిదండ్రులు పేర్కొన్నారు. దీనిపై ప్రిన్సిపల్ రహిసున్నిసా బేగంను వివరణ కోరగా.. క్రమశిక్షణ పాటించాలని నెమ్మదిగానే కొట్టానని చెప్పారు. వాలీబాల్ ఆడుతుంటే చేయికి దెబ్బతగిలితే కట్టు కట్టించామని తెలిపారు. మంగళవారం ఎంఈవో భాస్కర్ పాఠశాలకు వెళ్లారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి జిల్లా విద్యాధికారికి నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు.